Sweken
WE ARE HIRING !!
➢ NET Developers
➢ Data Entry
INTERESTED CANDIDATES PLEASE SEND YOUR RESUME TO MAIL: careers@sweken.com PH: 9100986585

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Bhavya Sai
PHOTO & VIDEO FILMING
Event Photo & Videography
Best Price
Photos & Videos Delivered with in 24 Hrs...
Press Events PRO in Vizag
CELL 9948511438

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 153 విశాఖపట్నం, 28 మార్చి 2025 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00




## అంగరంగ వైభవంగా స్వామి వారి నిత్య కల్యాణం

సింహాచలం, (విశాఖ సమాచారమ్) ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం, ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్ర పుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంత రముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

### వైభవంగా స్వామివారి స్వర్ణ పుష్పార్చన

స్వర్ణపుష్పార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వర్ణ పుష్పార్చణ అత్యంత వైభవంగా, సింహాచల పుణ్య క్షేత్రంలో దేవస్థాన వేదపండితుల వేద మంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా 108 బంగారు సంపెంగలతో స్వర్ణ పుష్పార్చన గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున ...(మిగతా 2లో)

## గత ప్రభుత్వ నిర్వాకమే పోలవరానికి శాపం



**సీఎం చంద్రబాబు విమర్శ**

**నిర్వాసితులతో ముఖాముఖి**


పోలవరం, (విశాఖ సమాచారమ్): జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోలవరం నిర్వాసితులకు రూ.10 లక్షల పరిహారం ఇస్తానన్నారని.. అధికారంలోకి వచ్చాక పైసా కూడా విదల్చలేదని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా గురువారం ఆయన నిర్వాసితులతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'వరదలు వచ్చినప్పుడు అప్పటి సీఎం జగన్ పట్టించుకోలేదు. రైతులు త్యాగం చేసి పోలవరం కోసం భూములు ఇచ్చారు. వారిలో కొందరికి మొదట్లో చాలా తక్కువ పరిహారం ఇచ్చారు. నిన్నమొన్నటి వరకూ నిర్వాసితులను పట్టించుకున్న ...(మిగతా 2లో)

### ప్రాజెక్టుకు తీరని నష్టం

గత పాలకుల అహంభావం, తెలియనితనం, రాజకీయ వివక్షతో పోలవరం ప్రాజెక్టుకు నష్టం వాటిల్లిందని సీఎం చంద్రబాబు విమర్శించారు. గోదావరి జలాల్లో 2 వేల టీఎంసీలు సముద్రంలోకి వెళ్తున్నాయని, అందులో 400 టీఎంసీలను వాడుకుంటే ఏపీని కరవు రహితం చేయవచ్చని అన్నారు. దీని కోసం ప్రాజెక్టు కట్టాలని 1941లోనే ప్రణాళికలు సిద్ధమయ్యాయని, అప్పుడు కట్టలేక ధవళేశ్వరం బ్యారేజీ కట్టారని గుర్తు చేశారు. గురువారం పోలవరం ప్రాజెక్టును సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "విభజన చట్టంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా పెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా ఏర్పడటానికి జూన్ 2 డెడ్‌లైన్‌గా ఉంది. ఏడు మండలాలు తెలంగాణలో ఉంటే ప్రాజెక్టు ...(మిగతా 2లో)

## గ్రామగ్రామాన 'నిఘా' నేత్రాలు

- ఇకపై ఇంట్లో కనీస అవసరాల్లో ఒకటిగా సీసీ కెమెరా
- నేరాల నియంత్రణలో ప్రతి పౌరుడి బాధ్యత
- జగ్గయ్యపేటలో సీసీ టీవీల ఏర్పాటు
- కార్యక్రమాల్లో హోంమంత్రి వంగలపూడి అనిత
- పోక్సో చట్టంపై 'స్టాటిస్టిక్స్ ఆఫ్ షేమ్' పుస్తకం ఆవిష్కరణ



అమరావతి, (విశాఖ సమాచారమ్): విజయ నగరంలో ఇటీవల డ్రోన్ ఎగరేసి పేకాటరాయుళ్లను పట్టుకున్నామని హెూంమంత్రి వంగలపూడి అనిత వెల్లడిరచారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి ఆటలు ఇకమీదట సాగనివ్వబోమని, టెక్నాలజీ ద్వారా ఆట కట్టిస్తామని ఆమె హెచ్చరించారు. ఇన్విజిబుల్ పోలిసింగ్‌కు ఈ ఘటనను నిదర్శనంగా హెూంమంత్రి పేర్కొన్నారు. జగ్గయ్యపేటలో సీసీ కెమెరాల ఏర్పాటు పైలట్ ...(మిగతా 2లో)



## సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్లు విడుదల



అమరావతి (విశాఖ సమాచారమ్): బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ అభివృద్ధికి కేంద్రం రూ.97.52 కోట్లు విడుదల చేసినట్లు ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వదేశీ దర్శన్ స్కీమ్ 2.0 కింద బీచ్‌కు నిధులు మంజూరు చేసినట్లు ఆయన వెల్లడించారు. త్వరలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో బీచ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన దుర్గేశ్.. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి బీచ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకొని నిధులు మంజూరు చేసినందుకు కేంద్ర మంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. పర్యాటకాభివృద్ధిని ప్రోత్సహిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు దుర్గేశ్ కృతజ్ఞతలు తెలిపారు.



### టీటీడికి రూ.2.45 కోట్ల విరాళాలు

తిరుమల, (విశాఖ సమాచారమ్): కలియుగ దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి ట్రస్టులకు భారీగా ...(మిగతా 2లో)

### ఏపీ-గేట్స్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం అమలుకు టాస్క్‌ఫోర్స్



అమరావతి, (విశాఖ సమాచారమ్): ఏపీ-బిల్‌గేట్స్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. సుపరిపాలన, సాగులో ఏఐ సాంకేతికత, వైద్యారోగ్యం, జీవన ప్రమాణాల పెంపుపై ఏపీ ప్రభుత్వం గేట్స్ ఫౌండేషన్‌తో ఇటీవల ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. దీని అమలుపై మొత్తం 26 మంది అధికారులతో తాజాగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. ...(మిగతా 2లో)

## త్వరలో భారత్ పర్యటనకు పుతిన్



మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. భారత్ పర్యటనకు రావాల్సిందిగా ప్రధాని మోదీ చేసిన ఆహ్వానాన్ని తమ దేశాధినేత పుతిన్ అంగీకరించినట్లు రష్యా విదేశాంగశాఖ మంత్రి సెర్గీ లావ్రోవ్ వెల్లడిరచారు. "రష్యా అండ్ ఇండియా: టువర్డ్ ఏ బైలాటరల్ అజెండా" పేరుతో రష్యన్ ఇంటర్నేషనల్ అఫైర్స్ కౌన్సిల్ నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో లావ్రోవ్ మాట్లాడుతూ.. ఈ పర్యటన కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. భారత ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన ప్రధాని మోదీ తొలి అంతర్జాతీయ పర్యటన రష్యాలో చేసిన విషయాన్ని లావ్రోవ్ గుర్తుచేశారు. ఇప్పుడు తమవంతు వచ్చిందన్నారు. అయితే, పర్యటన తేదీలను మాత్రం ఆయన వెల్లడిరచలేదు. ఇదిలాఉంటే, ప్రధాని మోదీ గతేడాది జులైలో రష్యాలో పర్యటించారు. ఐదేళ్ల వ్యవధి తర్వాత అక్కడ పర్యటించడం అదే తొలిసారి. అంతకుముందు 2019లో రష్యాలోని వ్లాదివోస్టోక్ నగరంలో నిర్వహించిన ఆర్థిక సదస్సులో మోదీ పాల్గొన్న ...(మిగతా 2లో)



## పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ

- ఢిల్లీ సర్కార్ నిర్ణయం..
- 1.63 లక్షల మందికి లబ్ధి

ఢిల్లీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు నీట్, సీయూఈటీ వంటి పోటీ పరీక్షల్లో రాణించేలా తీర్చిదిద్దేందుకు ఢిల్లీ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందుకోసం విద్యార్థులకు ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చేలా బిగ్ ఇన్‌స్టిట్యూట్, ఫిజిక్స్‌వాలా లిమిటెడ్ సంస్థలతో అవగాహన ఒప్పందం చేసుకుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో 12వ తరగతి చదువుతూ ...(మిగతా 2లో)

## అమెరికా దిగుమతులపై టారిఫ్ కోతలకు భారత్ మొగ్గు



ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి పలు దేశాలపై టారిఫ్‌లు విధిస్తున్నారు. ఏప్రిల్ 2 నుంచి అమలయ్యే ప్రతీకార సుంకాలను తప్పించుకునేందుకు అమెరికా దిగుమతులపై టారిఫ్ కోతల వైపు భారత్ మొగ్గుచూపుతోంది. ఈక్రమంలో రెండు దేశాల మధ్య మొదలైన ట్రేడ్ అండ్ టారిఫ్ చర్చల్లో భారత్ ధృడవైఖరిని ప్రదర్శిస్తోంది. కొన్ని వస్తువులపై టారిఫ్ కోతలకు అంగీకరించినప్పటికీ.. దేశ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తోంది. 'సుంకాలు తగ్గించినంత మాత్రాన అమెరికా ఒత్తిడికి లొంగిపోయినట్లు కాదు' అని కేంద్ర ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారి జాతీయ మీడియాతో మాట్లాడారు. "వ్యవసాయ ఉత్పత్తులైన వాల్‌నట్స్, యాపిల్, బాదం వంటి వాటిపై తగ్గింపునకు సిద్ధంగా ఉన్నాం. కానీ భారత్‌లో వ్యవసాయరంగ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గోధుమ, మొక్కజొన్న వంటివాటిపై రాయితీకి అవకాశం లేదు" అని తెలిపారు. ఇక.. విదేశాల్లో తయారై అమెరికాకు దిగుమతయ్యే కార్లపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. వచ్చే వారం ఈ చర్యలు అమల్లోకి వస్తాయని స్పష్టంచేశారు. ఇది శాశ్వతమైన చర్యగా పేర్కొన్న ఆయన అమెరికాలో తయారయ్యే వాటిపై మాత్రం ఎలాంటి సుంకం ఉండదని పేర్కొన్నారు. "ట్రంప్ ...(మిగతా 2లో)

## కోలాహలంగా ప్రారంభమైన జాతీయ నాటకోత్సవాలు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): అంతర్జాతీయ నాటక దినోత్సవాలను పురస్కరించుకొని రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'విశాఖ జాతీయ నాటకోత్సవాలు-2025' పిఠాపురం కాలనీ లోని కళాభారతిలో గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా కళాభారతి ప్రాం గణంలోకి విచ్చేయగా మహిళలు కోలాట నృత్యాలతో ఆహ్వానం పలికారు. మంత్రి కందుల దుర్గేష్ జ్యోతి ప్రజ్వలన చేసి నాటకోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తెలుగు నాటకాలను అంతర్జాతీయ స్థాయిలో నిలపడానికి ఇటువంటి ప్రదర్శనలు దోహద ...(మిగతా 2లో)



# కోలాహలంగా ప్రారంభమైన జాతీయ నాటకోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)



పడతాయని తెలిపారు. కళా రూపాలను, సాంప్రదాయ నాటక రంగాన్ని ప్రోత్సహిస్తూ రైటర్స్ అకాడమీ చేపడుతున్న సేవలు అమోఘమని కొనియాడారు. ఇటువంటి కళా ప్రదర్శనలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని తెలి పారు. తెలుగు నాటకాలకు జాతి స్థాయిలో గుర్తింపు తీసుకు రావడానికి కృషి చేస్తున్న రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి రమణమూర్తి, సిబ్బందిని ఆయన అభినందించారు. తప్పకుండా తెలుగు నాటకానికి అంతర్జాతీయ స్థాయి హోదా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశిష్ట అతిథులుగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధా ప్రసాద్, సెంచరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, మాజీ మంత్రి, రచయిత దాడి వీరభద్రరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన గుజరాత్ కు చెందిన రచయిత అర్పిల్ దాగత్ దర్శకత్వంలో 'ఐటెం' నాటకం ఆహూతులను ఆకట్టుకుంది.

# రూ.10 లక్షల కోట్లతో 25వేల కి.మీ రోడ్ల విస్తరణ

## ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యం : కేంద్రమంత్రి గడ్కరీ వెల్లడి



**ఢిల్లీ:** దేశంలో 25 వేల కిలోమీటర్ల మేర రెండు లైన్ల జాతీయ రహదారులను నాలుగు లైన్లుగా మారుస్తామని కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. రూ.10 లక్షల కోట్ల వ్యయంతో ఈ పనులు చేపడతామని, తద్వారా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుముఖం పడతాయన్నారు. లోక్‌సభలో మాట్లాడుతూ.. రూ.6లక్షల కోట్లతో 16వేల కి.మీ జాతీయ రహదారులను ఆరు లైన్లుగా మార్చుతామన్నారు. "రూ.10 లక్షల కోట్లతో 25వేల కి.మీ మేర రెండు లైన్ల జాతీయ రహదారులను నాలుగు లైన్లుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వీటికి సంబంధించి డీపీఆర్‌లు సిద్ధమవుతున్నాయి. రెండేళ్లలో పనులు పూర్తవుతా యని భావిస్తున్నాం" అని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు లకు ప్రాధాన్యం ఇస్తున్నామని, అవి పూర్తైన తర్వాత రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. మరో వైపు దేశంలో ఏటా 4.8లక్షల ప్రమాదాలు చోటుచేసుకుంటు న్నాయని కేంద్ర మంత్రి గడ్కరీ ఇటీవల వెల్లడించారు. వీటిలో 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన 1.88లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఈ ప్రమాదాల కారణంగా దేశ జీడీపీ ఏటా 3శాతం నష్టపోతోందన్నారు. 2030 నాటికి ఈ ప్రమాదాల సంఖ్యను సగానికి తగ్గించే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

# బాలికను వంచించిన వ్యక్తిపై పోక్సో కేసు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను గర్భవతిని చేసిన ఘటనలో సీహెచ్ సీతయ్య అనే వ్యక్తిపై ఎంవీపీ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వాసవానిపాలేనికి చెందిన 14 ఏళ్ల బాలిక 21వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతోంది. ఆమె తల్లి, అన్నయ్యతో కలిసి నివసిస్తోంది. అదే ప్రాంతానికి చెందిన వివాహితుడైన సీహెచ్ సీతయ్య గత ఏడాదిగా బాలికను ప్రేమ పేరుతో లోబరుచుకుంటున్నాడు. ఈ ఏడాది జనవరిలో ఓ ఇంటికి తీసుకెళ్లి ఆమెపై లైంగిక దాడి చేశాడు. ఆ తర్వాత కూడా పలుమార్లు ఆమెతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. బాలిక ప్రవర్తనలో మార్పులు గమనించిన తల్లి అనుమానంతో ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్ష చేయించగా, గర్భవతి అని తేలింది. దీంతో ఆమె తల్లి ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు సీతయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కడప జిల్లా జడ్పీ ఛైర్మన్ పదవి వైసీపీ కైవసం



**వైఎస్సార్ కడప జిల్లా (విశాఖ సమాచారమ్):** వైఎస్సార్ కడప జిల్లా జడ్పీ ఛైర్మన్ పదవి వైసీపీ కైవసం చేసుకుంది. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా వైసీపీ జడ్పీటీసీ రామగోవిందరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒకే ఒక్క నామినేషన్ రావడంతో ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం రామగోవిందరెడ్డి జడ్పీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, బ్రహ్మంగారిమఠం మండల జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల రామగోవిందురెడ్డిని వైసీపీ చైర్మన్ అభ్యర్థిగా ఆపార్టీ ప్రకటించింది. రెండు పర్యాయాలుగా బి.మఠం జెడ్పీటీసీగా ఆయన ప్రాతినిథ్యం వహిస్తున్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా నేతలతో ప్రత్యేకంగా సమావేశమై రామగోవిందురెడ్డి అభ్యర్థిత్వాన్ని ఎంపిక చేశారు.

# గ్రామగ్రామాన 'నిఘా' నేత్రాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టును హోంమంత్రి గురువారం ప్రారంభించారు. కొత్తగా 509 సీసీల ఏర్పాటుతో నేరాల నియంత్రణలో జగ్గయ్యపేట సర్కిల్ నమూనాగా నిలుస్తుందన్నారు. త్వరలోనే తన సొంత నియోజకవర్గం పాయకరావుపేటలోనూ ఈ ప్రాజెక్టును అమలు చేస్తామని స్పష్టం చేశారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య చొరవను హోంమంత్రి అభినందించారు. సీసీ టీవీల ఏర్పాటుకు కృషి చేస్తున్న సీపీ రాజశేఖర్ బాబు నేతృత్వంలోని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ప్రశంసించారు. జగ్గయ్యపేటలోని 71 గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రక్షిస్తామని చెప్పారు.

### ప్రతి ఇంటికి సీసీ కెమెరా అనివార్యం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సీసీ కెమెరాలు, డ్రోన్ లతో నేరస్థులు ఎక్కడికక్కడ చెల్లాచెదురవుతున్నారని, కొన్ని రోజుల కిందటే ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో 1000 సీసీ కెమెరాలు, 28 డ్రోన్ లు ఏర్పాటు చేశామని హోంమంత్రి తెలిపారు. టీవీ, ఫ్రిడ్జి, ఏసీలతో పాటు ప్రతి ఇంట్లో సీసీ కెమెరా కూడా కచ్చితంగా ఉండాలన్నారు. మద్యం, డ్రగ్స్, గంజాయి, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. శక్తి యాప్ , శక్తి టీంలు మహిళలను రక్షిస్తాయన్నారు. పోక్సో యాక్ట్ తో పాటు తప్పు చేస్తే శిక్షపడే చట్టాలకు ప్రచారం కల్పిస్తామన్నారు. నేర నియంత్రణలో ప్రతి పౌరుడు బాధ్యత వహించాలన్నారు. హెల్మెట్ లేదని పోలీసులు పట్టుకుంటే నేరుగా ఎమ్మెల్యేలకు ఫోన్ చేసే పరిస్థితి వాహనదారులకు మంచిది కాదని హోంమంత్రి అభిప్రాయపడ్డారు. ఫోన్‌కు స్క్రీన్ గార్డు వేయిస్తారు. విలువైన ప్రాణాన్ని రక్షించే హెల్మెట్ పెట్టుకోరా? అంటూ ఆమె ప్రశ్నించారు. హెల్మెట్ వినియోగిస్తే జరిమానా కట్టనవసరం లేదు.. ప్రమాదంబారిన పడాల్సిన అవకాశం ఉండదన్నారు. పోక్సో చట్టానికి సంబంధించిన 'స్టాటిస్టిక్స్ ఆఫ్ షేమ్' పుస్తకాన్ని హోంమంత్రి ఆవిష్కరించారు. పుస్తకం కోసం కృషి చేసిన పోలీసు ఉన్నతాధికారులకు హోంమంత్రి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, తంగిరాల సౌమ్య, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, డీసీపీలు గౌతమి, సరిత, ఉదయరాణి, సురక్ష కమిటీ కన్వీనర్ నర్సయ్య, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రన్యారావుకు బెయిల్ నిరాకరణ

## స్మగ్లింగ్ కేసులో మరో వ్యక్తి అరెస్టు..



**బెంగళూరు:** బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావు బెయిల్ పిటిషన్‌పై బెంగళూరులోని సెషన్స్ కోర్టు విచారణ చేపట్టింది. ఆమెకు బెయిల్ మంజూరు చేసేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ప్రస్తుతం తమ కస్టడీలో ఉన్న రన్యారావును అధికారులు విచారిస్తున్నారు. అయితే.. బెయిల్ కోసం ఆమె హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడిరచాయి.

### గోల్డ్ డీలర్ అరెస్టు

రన్యారావు కేసులో మరో వ్యక్తిని అధికారులు తాజాగా అరెస్టు చేశారు. సాహిల్ జైన్ అనే వ్యక్తి గోల్డ్ డీలర్‌గా వ్యవహరించాడు. నటి అక్రమంగా బంగారాన్ని రవాణా చేసేందుకు ఇతడు సహకరించాడు. అంతేకాకుండా, గతంలోనూ రెండు సార్లు ఆమెకు సహాయం చేశాడని డీఆర్ఐ అధికారుల దర్యాప్తులో తేలింది. అందుకు సంబంధించిన ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా.. దుబాయ్ నుంచి అక్రమంగా 14 కేజీలకు పైగా బంగారం తరలిస్తుండగా.. ఎయిర్‌పోర్టులో రన్యారావును అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మరో నిందితుడు తరుణ్ రాజ్‌కు ఆమె ఆర్థిక సహాయం చేసినట్లు డీఆర్ఐ విచారణలో తేలింది. ఆమె పంపిన డబ్బుతోనే నిందితుడు దుబాయ్ నుంచి హైదరాబాద్ వెళ్లాడని కోర్టుకు తెలిపారు. అంతేకాకుండా, బ్యాంకాక్, జెనీవాకు బంగారాన్ని అక్రమంగా రవాణా చేసేవారని పేర్కొంది. తరుణ్ రాజ్ దుబాయ్ వెళ్లినరోజే తిరిగి వచ్చేవాడని ఆరోపించింది. తరుణ్‌రాజ్, రన్యారావు స్నేహితులని.. వీరిద్దరూ 2023లో దుబాయ్‌లో విరా డైమండ్స్ ట్రేడిరగ్ ఎల్ఎల్‌సీ అనే ట్రేడిరగ్ కంపెనీని స్థాపించారని.. నాటినుంచి వ్యాపార భాగస్వాములుగా కొనసాగుతూ దీనిని నిర్వహిస్తున్నారని తెలిపింది.

# ఆయనపై చర్యలు తీసుకోకపోతే రాజీనామా చేస్తా ..

- టిడిపి ఎమ్మెల్యే కొలికపూడి



**తిరువూరు, (విశాఖ సమా చారమ్):** టిడిపి నేత రమేశ్ రెడ్డిపై పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకోకపోతే తాను రాజీనామా చేస్తానని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రకటించారు. ఓ మహిళపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియో ఇటీవల వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలంటూ గిరిజన మహిళలు ఆందోళనకు దిగారు. దీంతో స్పందించిన కొలికపూడి.. రమేశ్‌రెడ్డి వ్యవహారాన్ని పది రోజుల క్రితమే పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. 48 గంటల్లోగా ఆయనపై చర్యలు తీసుకోవాలని అధినాయకత్వాన్ని కోరారు. బాధితులకు న్యాయం జరగకపోతే ఎమ్మెల్యేగా తానెందుకని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

# స్వామి వారి నిత్య కల్యాణం

(మొదటి పేజీ తరువాయి)

స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపములో వేదికపై అధీష్టింప జేసి వేద మంత్రాలు నాథ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి స్వర్ణపుష్పార్చన, సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా భక్తులు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు.

# అమెరికా దిగుమతులపై టారిఫ్ కోతలకు భారత్ మొగ్గు

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం భారత ఆటోమొబైల్ పరిశ్రమపై గణనీయంగా ఉంటుంది. కానీ ద్విచక్రవాహనాలు, చిన్నపాటి కార్లపై కొన్ని సుంకాలు తగ్గించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని ఆ అధికారి వెల్లడిరచారు. ఇదిలాఉంటే.. ట్రంప్ నిర్ణయంతో ఆటోమొబైల్ షేర్లు భారీగా కుంగాయి. అమెరికా నుంచి మన దేశంలోకి వస్తున్న ఉత్పత్తులపై ఇక్కడ ఎంత సుంకం విధిస్తే, ఇక్కడినుంచి అమెరికాకు చేరుతున్న అదేతరహా ఉత్పత్తులపై సమాన సుంకాన్ని ఏప్రిల్ 2 నుంచి అమలుచేస్తామని అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు. ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రకారం.. భారత ఉత్పత్తులపై అమెరికా సగటున 2.2% సుంకం విధిస్తుండగా.. అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకం సగటు 12 శాతంగా ఉంది.

# అమలుకు టాస్క్ ఫోర్స్

(మొదటి పేజీ తరువాయి)

మానవ వనరుల అభివృద్ధి, సాధారణ పరిపాలన శాఖతోపాటు, గ్రామవార్డు సచివాలయశాఖ కార్యదర్శులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఎంవోయూ కుదుర్చుకున్న అంశాల అమలును పర్యవేక్షిం చాల్సిందిగా టాస్క్ ఫోర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

# త్వరలో భారత్ పర్యటనకు పుతిన్

(మొదటి పేజీ తరువాయి)

సంగతి తెలిసింది. ఇటీవల రష్యా పర్యటన సందర్భంగా భారత్‌కు రావాలని పుతిన్‌ను మోదీ ఆహ్వానించారు. అమెరికా నుంచి టారిఫ్‌ల ముప్పు, ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపునకు సంప్రదింపులు జరుగుతోన్న సమయంలో పుతిన్ భారత్‌లో పర్యటించనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# టీటీడికి రూ.2.45 కోట్ల విరాళాలు

(మొదటి పేజీ తరువాయి)

విరాళాలు అందుతున్నాయి. టీటీడీ నిర్వహిస్తున్న వివిధ పథకాలకు గురువారం రూ.2.45 కోట్లు విరాళాలు అందినట్లు టీటీడీ అధికారులు వెల్లడిరచారు. చెన్నైకు చెందిన జినేశ్వర్ ఇన్ ఫ్రా వెంచర్స్ సంస్థ టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళంగా అందించింది. శ్రీలంకకు చెందిన ఓ దాత అన్న ప్రసాదం ట్రస్టుకు మరో రూ.కోటి విరాళం అందించారు. నోయిడాకు చెందిన పసిఫిక్ బీపీవో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.45 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ చైర్మన బీఆర్ నాయుడు, అదనపు ఈవో సిహెచ్.వెంకయ్య చౌదరికి డీడీలు అందజేశారు.

# గత ప్రభుత్వ హయాంలో భారీ లిక్కర్ స్కామ్

## బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆరోపణ



**విజయవాడ, (విశాఖ సమాచారమ్):** గత ప్రభుత్వ హయాంలో భారీగా లిక్కర్ స్కామ్ జరిగిందని, సీబీఐ , ఈడీ తో సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరిగిన ఈ లిక్కర్ స్కామ్‌ను తాను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్రంలో మద్యం కుంభకోణం జరుగుతోందని గతంలోనే తాను చెప్పానని, కానీ తనను ట్రోల్ చేశారని గుర్తు చేశారు. రూ. 4 వేల కోట్ల స్కాం కాదని, ఇంకా చాలా పెద్దదని వ్యాఖ్యానించారు. జగన్ హయాంలో ప్రజా ధనం వృధా అయిందని, వేల కోట్లు ఇతరుల జేబుల్లోకి వెళ్లాయని సోము వీర్రాజు ఆరోపణలు చేశారు. కూటమి ప్రభుత్వంలో మద్యం బ్రాండ్స్ అన్ని బయట నుంచి కొంటున్నా రని, గత ప్రభుత్వంలో లిక్కర్ కంపెనీలను, ఫిల్లింగ్ సెంటర్లను వైసీపీ వాళ్లే స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. రూ.5, రూ.6కు చీప్ లిక్కర్ తయారు చేసి దాన్ని అధిక ధరలకు ప్రభుత్వం కొనుగోలు చేసి ఇష్టమొచ్చిన బ్రాండ్ల పేరుతో అమ్మకాలు జరిపిందన్నారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన మద్యం స్కాంలో లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. లిక్కర్ స్కాంపై సీఎం రమేశ్‌తో ఇప్పటికే తాను చర్చించానని తెలిపారు. రాష్ట్రంలో కూటమి నాయకులందరం కలిసి మాట్లాడుకుని ఓ మాటపై ముందుకు వెళ్తామన్నారు. లిక్కర్ స్కాంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సీఐడీతో దర్యాప్తు చేయిస్తోందని వీర్రాజు తెలిపారు.

# వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్ కొట్టివేత

- టీడీపీ కార్యాలయంపై దాడి కేసు



**విజయవాడ, (విశాఖ సమాచారమ్):** గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో వైకాపా నేత వల్లభనేని వంశీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను సీఐడీ కోర్టు కొట్టివేసింది. బెయిల్ ఇవ్వాలని కోరుతూ వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడ సీఐడీ కోర్టులో గురువారం విచారణ జరిగింది. వాదనలు విన్న న్యాయస్థానం.. వంశీ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వంశీతో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో నలుగురు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లనూ న్యాయస్థానం కొట్టివేసింది.

# గత ప్రభుత్వ నిర్వాకమే పోలవరానికి శాపం

(మొదటి పేజీ తరువాయి)

నాథుడు లేడు. వీళ్లెనంత త్వరగా పరిహారం ఇచ్చే ప్రయత్నం చేస్తాం. కేంద్రాన్ని ఒప్పించి 7 మండలాలను ఏపీలో విలీనం చేశాం. ఎప్పుడో పూర్తి కావాల్సిన పోలవరం ప్రాజెక్టును జగన్ పక్కన పెట్టారు. ఈ ప్రాజెక్టు సొమ్మును ఇతర పథకాలకు మళ్లించారు. రూ.829 కోట్లు నేరుగా నిర్వాసితుల ఖాతాలో వేసిన ఘనత మా ప్రభుత్వానిది. పోలవరంలో నీళ్లు వదిలే ముందే.. 2027 నవంబర్ నాటికి పునరావాసం పూర్తిచేస్తాం. దళారులు, మోసగాళ్లకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటాం. నిర్మాణంలో ఆలస్యం వల్ల హైడల్ ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగింది. 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తిచేస్తాం. మన ఎన్డీయే ప్రభుత్వం వచ్చింది.. సకాలంలో ప్రాజెక్టును పూర్తి చేసుకుందాం" అని చంద్రబాబు అన్నారు. అంతకుముందు ఏరియల్ వ్యూ ద్వారా ప్రాజెక్టు ప్రాంతాన్ని సీఎం పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు ఉన్నారు.

# ప్రాజెక్టుకు తీరని నష్టం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తికాదు. జూన్ 2 దాటితే రెండు రాష్ట్రాలు బిల్లును ఆమోదించాలి. ఆ ఏడు మండలాలను ఏపీకి ఇవ్వడం ప్రాజెక్టుకు దోహదమైంది. ప్రాజెక్టును పూర్తి చేయగలమనే ధీమాతో ముందుకెళ్లాం. పోలవరం ప్రాజెక్టును 73 శాతం పూర్తి చేశాం. పోలవరంపై 82 సార్లు వర్చువల్‌గా సమీక్షించాను. ప్రాజెక్టు ఆలస్యమవుతుందని పట్టిసీమ నిర్మాణం చేపట్టాం. ఎడమ ప్రధాన కాలువ పనులు కూడా వేగవంతం చేశాం. వైకాపా హయాంలో జరిగిన తప్పు.. చరిత్ర క్షమించరాని నేరం. జాతీయ ప్రాజెక్టు, ప్రజల ఆస్తిని నాశనం చేసే హక్కు ఎవరికీ లేదు. గతంలో డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న సంగతి కూడా ఎవరికీ తెలియదు. కాఫర్‌డ్యామ్ సకాలంలో పని చేసి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదు. ఊహించని నష్టం జరిగింది. పోలవరం విషయంలో నిపుణుల కమిటీ పరిశీలించింది. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ మళ్లీ నిర్మించాలని నిర్ణయించాం. డయాఫ్రమ్‌వాల్ నిర్మాణానికి రూ.990 కోట్లు ఖర్చవుతోంది. 2020లో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు 2027 డిసెంబర్‌కు పూర్తయ్యే పరిస్థితి ఏర్పడిరది" అని చంద్రబాబు అన్నారు.

# పాక్ జైలులో భారత మత్స్యకారుడు ఆత్మహత్య

**కరాచీ:** పాకిస్థాన్ కారాగారంలో మగ్గిపోతున్న భారత్‌కు చెందిన ఓ మత్స్యకారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాత్‌రూమ్‌లో ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఆ జైలు సూపరింటెండెంట్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. భారత్- పాకిస్థాన్ జల సరిహద్దులపై సరిగా అవగాహన లేకుండా చేపల వేటకు వెళ్లి అక్కడి అధికారులకు చిక్కినవారు ఎంతోమంది ఉన్నారు. అదేవిధంగా భారత్‌కు చెందిన మత్స్యకారుడు గౌరవ్‌రామ్ ఆనంద్‌ను (52) 2022లో అదుపులోకి తీసుకున్నారు. అతడిని అరెస్టు చేసి కరాచీ జైల్లో ఉంచారు. నాటినుంచి అతడు అక్కడి కారాగారంలోనే మగ్గిపోతున్నాడు. అయితే.. మంగళవారం రాత్రి బాత్‌రూమ్‌లోకి వెళ్లిన మత్స్యకారుడు తాడుతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడు ఎంతసేపటికి బయటకి రాకపోవడంతో అనుమానించిన జైలు అధికారి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసేంతవరకు మృతదేహాన్ని కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచనున్నట్లు పాక్ అధికారులు తెలిపారు. కాగా.. గత నెలలో తమ కారాగారంలో ఉన్న 22 మంది మత్స్యకారులను పాక్ ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే. వారి శిక్షాకాలం పూర్తికావడంతో కరాచీలోని మాలిర్ కారాగారం నుంచి విడుదల చేసింది. మత్స్యకారులు సరిహద్దులను సరిగా గుర్తించకపోవడంతో ఇరువైపులా ఈ అరెస్టులు జరుగుతున్నాయి. ఇదిలాఉంటే.. జనవరి 1న ఇరుదేశాల ఖైదీల జాబితా మార్పిడి జరిగింది. పాకిస్థాన్‌లో 266 మంది భారత ఖైదీలు ఉన్నారు. భారత జైళ్లలో మొత్తం 462 మంది పాకిస్థానీయులు ఉన్నట్లు మన దేశ జాబితా పేర్కొంది. తాజాగా ఓ మత్స్యకారుడు జైల్లో ఆత్మహత్యకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది.

# పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

సీయూఈటీ, నీట్ పరీక్షలకు సన్నద్ధమయ్యే దాదాపు 1.63లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. దిల్లీ డైరెక్టరేట్ ఆఫ్ ఎడ్యుకేషన్, బిగ్ ఇన్‌స్టిట్యూట్, ఫిజిక్స్‌వాలాతో పాటు ఎన్ఎస్‌డీసీ ఇంటర్నేషనల్, కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖలు సంయుక్త చొరవతో ఈ కార్యక్రమం చేపడు తున్నారు. ఈ మేరకు సీఎం రేఖాగుప్తా, విద్యాశాఖ మంత్రి ఆశీష్ సూద్ సమక్షంలో సంబంధిత విభాగాలకు చెందిన ప్రతినిధులు ఎంవోయూలపై సంతకాలు చేశారు. ఏప్రిల్ 2 నుంచి మే 2వరకు రోజూ ఆరు గంటల చొప్పున విద్యార్థులకు ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వ నున్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథమెటిక్స్, జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ వంటి సబ్జెక్టులను కవర్ చేస్తూ ఆన్‌లైన్ బోధన కొనసాగించ నున్నారు. ప్రభుత్వ విద్యార్థులు మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్లు పొందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీఎం రేఖా గుప్తా తెలిపారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు ఈ కీలక పరీక్షల్లో రాణించేందుకు అవసరమైన మార్గదర్శనం అందుతుందని, అగ్రశ్రేణి వైద్య కళాశాలలు, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు పొందే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని విద్యాశాఖ మంత్రి ఆశీష్ సూద్ అన్నారు. మరోవైపు, ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా పీడీఎఫ్ నోట్సు, విద్యార్థుల పురోగతిని ట్రాక్ చేసేలా పరీక్షలు, నిరంతరం సందేహాల నివృత్తి ఉంటుందని ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వం తీసుకున్న ఈ చొరవ పేద విద్యార్థులకు ఓ గేమ్ ఛేంజర్ లాంటిదని పేర్కొంది.

# నేడు జర్నలిస్టుల ఉగాది సంబరాలు

- సమస్యలపై కూటమి నేతలకు వినతులు
- వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం లో గంట్ల



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు కోసం ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా శుక్రవారం ఉగాది సంబరాలు అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు తెలిపారు.

గురువారం ఇక్కడ అక్కయ్య పాలెం జంక్షన్ లోని ఒక ప్రైవేట్ హొటల్ లో ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ విశాఖ యూనిట్ కార్య వర్గ సమావేశం నిర్వహించి పలు అంశాలు పై చర్చించారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీను బాబు మాట్లాడుతూ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈ సంబరాలు అత్యంత ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. శుక్రవారం ఉదయం ఆల్పాహారం నుంచి మధ్యాహ్నం విందు వరకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణము నిర్వహించి పంచాంగ పుస్తకాలు జర్నలిస్ట్ లకు అందచేస్తామన్నారు. ప్రత్యేక ఆకర్షణగా లక్కీడిప్ ఏర్పాటు చేసామన్నారు. జర్నలిస్టుల సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని,జర్నలిస్టులకు తక్షణమే ఇళ్ల స్థలాలు, ఇండ్లు కేటాయించాలన్నారు. కూటమి ప్రభుత్వం గతంలోనే ఇందుకు సంబంధించి హామీలు ఇవ్వడం జరిగిందని తెలుగు దేశం పార్టీ తమ మేనిఫెస్టోలో కూడా జర్నలిస్టులకు సంబంధించి రూపకల్పన చేసిందన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లకు తమ రాష్ట్ర కార్యవర్గం ద్వారా వినతులు అందజేశామన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని గంట్ల శ్రీను బాబు కోరారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ అర్బన్ అధ్యక్షులు పి నారాయణ, కార్యదర్శి జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల విశాఖ లో 650 మంది వర్కింగ్ జర్నలిస్టులు తమ యూనియన్ లలో సభ్యత్వాన్ని నమోదు చేయించుకున్నట్లు చెప్పారు.

ఉగాది సంబరాలు జయప్రదం చేయాలని కోరారు. ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ధవలేశ్వరం రవికుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎ. సాంబ శివరావు, బ్రాడ్ కాస్ట్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వర్ రావు, కార్యదర్శి కె. మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ మోహన్, కార్యదర్శి కొచ్చెర్ల శ్రీనివాస్, గాజువాక, మధురవాడ, యూనియన్ నేతలు గొడబ రాంబాబు, ఆనంద్,రంగ ధామము, కోశాధికారి సీతారామ మూర్తి, ఉపాధ్యక్షులు రామకృష్ణ, బందరు శివ ప్రసాద్, ఎంపీ రాజశేఖర్, నాయుడు గణపతి, బొబ్బర ప్రసాద్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా ఉండాలి



చోడవరం, (విశాఖ సమాచారమ్):- నియోజకవర్గం నందలి రోలుగుంట , రావికమతం మండల నాయకులతో నియోజకవర్గ ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో గ్రామములనందు ప్రజలకు సంబంధించిన పలు కార్యక్రమాలను చర్చించి వాటి సాధనకు అవసరమగు కార్యాచరణ రూపొందించుట జరిగింది. ఉపాధి హామీ పథకంలో చేసే పనులు పారదర్శకంగాను, ప్రజోపయోగంగాను ఉండే విధంగా ప్రతిపాదనలు సిద్ధంచేసి సంబంధిత అధికారులకు అందచేయాలని నిర్ణయించారు. పవన్ కళ్యాణ్ ఆదేశములను పాటిస్తూ స్థానిక శాసన సభ్యులు మరియు కూటమి నాయకులతో సమన్వయంగా పనిచేయాలని ఉగాదికి ప్రారంభం కాబోతున్న పి4 కార్యక్రమంలో పార్టీ నాయకులు క్రియాశీలకంగా పనిచేయాలని నిర్ణయించారు. రోలుగుంట మండలంలో జరుగుతున్న భారీ మైనింగ్ కార్యకలాపాలవల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయా గ్రామ నాయకులు పేర్కొనగా ఈ అంశంపై పూర్తి సమాచారంతో అవసరమగు చర్యలు తీసుకునుటకు జిల్లా ఇంచార్జి మరియు మైనింగ్ శాఖా మంత్రివర్యులు కొల్లు రవీంద్ర ని కలవడానికి నిర్ణయం తీసుకొనుట జరిగింది అని తెలియజేశారు.

## మాడుగుల ఎంపీపీని అభినందించిన గిడ్డి ఈశ్వరి



జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- మండల ప్రజా పరిషత్ అధ్యక్ష ఎన్నిక. బై ఎలక్షన్ రావటం వలన 14 మంది ఎంపీటీసీలు కలిగిన జి మాడుగుల మండల ప్రజా పరిషత్ అధ్యక్ష ఎన్నికల్లో టీడిపి బలపరిచిన లొంబోరి అప్పలరాజును ఏకగ్రీవం గా ఎన్నుకోబడ్డారూ. ఎన్నుకోబడిన అప్పలరాజును పాడేరు నియోజకవర్గం ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి పూలదండ దుస్సాలతో సన్మానించి అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్ర నాగరాజు ట్రైకర్ డైరెక్టర్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బొర్ర విజయ రాణి, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి చిట్టిబాబు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు డప్పోడి వెంకటరమణ పాడేరు మాజీ ఎంపీపీ ఎస్.వి.రమణ మూర్తి లగిసపల్లి సర్పంచ్ పార్వతమ్మ మధ్య రాజు, జై మాడుగుల మాజీ పార్టీ అధ్యక్షులు జి మాడుగుల మండల పార్టీ అధ్యక్షులు కొండలరావు గంపరాయి నాగబ్బయ్ రెడ్డి బాబు కిడారి భీమ్ బాబు, పార్టీ పాటి భీమ్ బాబు కళ్యాణం నాయకులు కార్యకర్తలు ఎంపీటీసీలు సర్పంచులు మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కలశ పునః ప్రతిష్ట కార్యక్రమానికి సభాపతి అయ్యన్నపాత్రుడుకు ఆహ్వానం



నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):- శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం, అన్నవరమునకు దత్తత దేవాలయమైన శ్రీ రమా సహిత వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి ఆలయం, ఉత్తరవాహిని, బలిఘట్టం నందు ఏప్రిల్ 12వ తేదీ శనివారం ఉదయం గం. 11.25ని.లకు కలశ పునః ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. దేవాలయ శిఖరముపై గల కలశము క్రింద పడిపోయిన కారణంగా, సదరు కలశమును పునః ప్రతిష్ఠ చేయవలసిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో దేవస్థానం వైధిక కమిటీ నిర్ణయముచే నిష్ణాతులైన వేద పండితులు, ఋత్వికులతో కలశ పునః ప్రతిష్ఠ కార్యక్రమము నిర్వహిం చబడుతుంది. ఈ కార్యక్రమానికి స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడుని ఆహ్వానించుటకు అన్నవరం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ రామ్ మోహన్ రావు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, అప్పారావు, బలిఘట్టం సత్యనారాయణ స్వామి ఆలయ ధర్మకర్త శెట్టి మోహన్, ఆలయ అర్చకులు భద్రాచల రామం కలిసి ఆహ్వానించారు.

## కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కొరకు ఇ-శ్రమ్ పోర్టలులో పేర్లు నమోదు చేసుకోండి

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- ప్రమాదవశాత్తు మరణించిన లేదా పాక్షిక మరియు శాశ్వత అంగవైకలము పొందిన వారు కేంద్ర ప్రభుతము అందించే ఆర్థిక సహాయము కొరకు ఇ-శ్రమ్ పోర్టలులో పేర్లు నమోదుకు 2025 మార్చి 31వరకు గడువు పొడిగించినట్లు కార్మికశాఖ ఇంచార్జి జిల్లా కమిషనరు కె. వసంతరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లా కలెక్టరు విజయ కిష్షన్ ఆదేశాల ప్రకారం గౌరవ భారత దేశ సుప్రీం కోర్ట్ వారి ఉత్తర్వులు మేరకు దేశములో వున్న అసంఘటిత రంగ కార్మికులు 2022 సంవత్సరం, మార్చి 31 తేదికి ముందు మరణించిన లేదా గాయపడిన వారి వివరాలు కేంద్ర ప్రభుతము అందించే ఆర్థిక సహాయము కొరకు నమోదు ప్రక్రియ కొరకు ప్రభుతము ఇ-శ్రమ్ పోర్టల్ ను ఏర్పాటు చేసిందని, సదరు పోర్టల్ నందు కార్మికులు స్వయంగా నమోదు చేసుకొనవచ్చునని తెలిపారు. అందుకు కార్మికుని ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు అనుసంధానమైన మొబైల్ నెంబర్ మరియు కార్మికుని యొక్కసేవింగ్స్ బ్యాంకు అకౌంట్ నెంబర్, ఐఎఫ్ఎస్సి కోడ్, బ్రాంచ్ వివరములు అవసరమన్నారు. కార్మికులు స్వయంగా register.eshram.gov.in/#user/self లింక్ ను ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు.

## ఈనెల 27 నుండి తాకాశి వీధి నూకాంబికా అమ్మవారి ఉత్సవాలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- పట్టణంలోని తాకాశి వీధి పుట్టలో స్వయంభూగా వెలసిన శ్రీ నూకంభిక అమ్మవారు కొత్త అమావాస్య జాతర మహోత్సవములు, ఈనెల 27 నుండి వచ్చేనెల 27 వరకు జరుగుతాయి, దివంగత తాకాశి ఉమామహేశ్వరవు (బాబు) ఆశీస్సులతో, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, తాకాశి రాజేష్ , సారథ్యంలో,ఉత్సవ కమిటీ చైర్మన్,తాకాశి కిషోర్ కార్యక్రమాలు తెలియజేశారు, 27నపురవీధుల గుండా అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, గరగలు, మల్లవరపు వారి వీధి,మెయిన్ రోడ్, వేల్పుల వీధి,గూడ్స్ రోడ్ సాయిబాబా గుడి,మల్ల వీధి, గాంధీబొమ్మ సెంటర్ నుండి, ఊరేగింపు మహోత్సవం అత్యంత వైభవంగా జరుగును, ఈ కార్యక్రమంలో, తాడు పెద్ద సేవ, కోలాటం, తప్పెటగుళ్ళు, నవ కాళీలు,పులి వేషాలు, తో జరుగును, తేదీ: 28.3. 25,న అమ్మవారి గుడి దగ్గర, ప్రముఖ కొరియోగాపర్,సురేష్ మాస్టర్ ఆధ్వర్యంలో కూచిపూడి కళావైభవం ప్రోగ్రాం, మెయిన్ రోడ్ ఎమ్మెస్ రావు, షాపింగ్ మాల్ వద్ద,తాకాశి ఇదే మా బ్రాండ్, డాన్స్ షో, గాంధీ బొమ్మ జంక్షన్ వద్ద తాకాశి వీధియూత్ ఆధ్వర్యంలో,ఓ.జి,బాయ్సఅను డ్యాన్స్ షో కార్యక్రమం జరుగును, 29న కొత్త అమావాస్య సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో అలంకరణ,కుంకుమ పూజలు,జరుగును, ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారని ,ఉత్సవ కమిటీ చైర్మన్ కిషోర్ తెలిపారు.

## మరణించిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- అనకాపల్లి జిల్లాకు చెందిన హోంగార్డు పప్పుల లక్ష్మి, విశాఖపట్నం, కైలాసగిరి ఆర్మ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో, ఆమె భర్త పప్పుల శంకర రావు కు అనకాపల్లి. అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు స్వచ్ఛందంగా అందించిన ఒక రోజు డ్యూటీ అలవెన్స్ సహా ఇతర ఆర్థిక సహాయాన్ని కలిపి మొత్తం రూ.4,17,565/- నగదు చెక్కును అందజేశారు.ఈ చెక్కును అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాతన కార్యాలయంలో పప్పుల శంకర రావు కు అధికారికంగా అందించారు.హోంగార్డులు విధి నిర్వహణలో మృతి చెందిన లేదా పదవీ విరమణ పొందిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు హోంగార్డులంతా తమ ఒక రోజు డ్యూటీ అలవెన్స్‌ను విరాళంగా అందించే మంచి ఆచారం పాటిస్తున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, తో పాటు అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఏవో ఏ.రామ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ టి.రమేష్ పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ జనరల్ బాడీ సమావేశం



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- విశాఖపట్నం జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం గురువారం ఇంజనీర్స్ ఇన్స్టిట్యూట్‌లో జరిగింది. సాధారణ మెనూతో పాటు, టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాన్సెప్ట్ పరిచయం టిబిఐ ట్రస్ట్ కోసం శ్రీ సత్యనారాయణ స్థానిక నిర్వాహకుడి ద్వారా షేర్ చేయబడింది.

## టైలరింగ్ లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- అనకాపల్లి జిల్లా మాకవరపాలెం లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (నెక్ ) శిక్షణ కేంద్రంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (నెక్ ) మరియు రాష్ట్ర నైపుణ్యాభివృధి సంస్థ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులములకు చెందిన మహిళలకు టైలరింగ్ కోర్సులో స్వల్ప కాలిక నైపుణ్యాభివృద్ధి ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అనకాపల్లి జిల్లా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (నెక్ ) సహాయ సంచాలకులు ఎస్ వి ఎస్ ఎస్ రవి కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 44 ఏళ్ల లోపు వయసు ఉన్న మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు అనకాపల్లి జిల్లాకు చెందినవారై ఉండాలని, శిక్షణ నాన్ రెసిడెన్షియల్ పద్దతిలో ఏప్రిల్ 2025 మొదటి వారములో ప్రారంభించడం జరుగుతుందని శిక్షణా అనంతరం కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ తో పాటు సంబంధిత రంగంలో ఉపాధి కల్పించడం జరుగుతుందని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## దివ్యాంగ విద్యార్థులకు బస్ పాసులు పంపిణీ



రావికమతం, (విశాఖ సమాచారమ్):- గురువారం మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రావికమతం మండలానికి చెందిన 14 మంది దివ్యాంగ విద్యార్థులకు నర్సీపట్నం డిపో అధికారులు ధీరజ్ ఆధ్వర్యంలో జారీ చేసిన బస్ పాస్ లను స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, ఐ.ఈ.ఆర్.పి జగన్నాథ నాయుడు, మేడివాడ హైస్కూల్ ఉపాధ్యాయులు అప్పలనాయుడు, నాగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు.

స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ మన మండలంలో గతంలో ఆల్రెడీ 70 మంది దివ్యాంగ విద్యార్థులకు బస్సు పాసులు అందజేయడం జరిగిందని , మిగిలిన వారికి ఇప్పుడు అందించడం జరిగింది అన్నారు. అలాగే ఈ బస్సు పాస్‌ల ద్వారా దివ్యాంగ విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా 50% రాయితీ తో ప్రయాణించవచ్చని అలాగే తీవ్ర మరియు అతి తీవ్ర వైకల్యంతో బాధపడుతున్న వారితోపాటు ఎస్కార్ట్ వెళ్లిన వారికి కూడా 50% రాయితీ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో దివ్యాంగు విద్యార్థులు వారి తల్లిదండ్రులు మేడవాడ హైస్కూల్ ఉపాధ్యాయులు ఎర్రయ్య, బ్రహ్మాజీ , రమణాజి తదితరులు పాల్గొన్నారు.

## ఏటీఎం కార్డులతో డబ్బులు కాజేస్తున్న దొంగ అరెస్టు



నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):- నర్సీపట్నం పట్టణ పోలీస్ స్టేషన్ నందు నర్సీపట్నం సబ్-డివిజన్ డీఎస్పీ పి శ్రీనివాసరావు అధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల ఫిబ్రవరి 10న మధ్యాహ్నం సుమారు 12.30 గం.ల సమయంలో నర్సీపట్నం కృష్ణా బజార్ ఎస్బిఐ ఎటీఎం వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఒకరు షేక్ రుక్సేన తండ్రి లేటు షేక్ సబ్జాన్ అను ఆమె యొక్క ఏటీఎం కార్డును మార్చి రూ-30,000/- రూపాయలను విత్ డ్రా చేసినాడు, సదరు సంఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి సదరు ముద్దాయిని అరెస్ట్ చెయడమైనది అని సదరు ముద్దాయి ఇటు వంటి ఏటీఎం దొంగతనాలు రాష్ట్రంలో పలుచోట్ల చేశాడని ఆయన తెలిపారు.

## ఎంపీపీగా లోబోరి అప్పలరాజు



జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- జి మాడుగుల మండల పరిషత్ అధ్యక్షులుగా తెలుగుదేశం పార్టీ కి చెందిన బోయతిలి ఎంపీటీసీ సభ్యులు లొంబోరి అప్పలరాజు ఎన్నికయ్యారు. మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా కే కొండపల్లి తన పదవికి రాజీనామా చేయిగా బీరం బేరం ఎంపీటీసీ ఇటీవలే మృతి చెందారు. 13 ఎంపీటీసీ సభ్యులు ఉండగా ఎంపీపీ స్థానానికి టిడిపి నుంచి అప్పలరాజు వైసిపి నుంచి కుడుముల సత్యనారాయణ పోటీ పడగా టిడిపి అభ్యర్థి అప్పలరాజు కు ఏడుగురు ఎంపీటీసీలు కుడుముల సత్యనారాయణ మద్దతు ఇవ్వగా ఎన్నికల అధికారి మెజార్టీ ఉన్న లంబాడి అప్పలరాజును ప్రకటించారు.

## ఎండకాలంలో జాగ్రత్తలు పాటించాలి

తురకలపూడి వైద్యాధికారిణి సంధ్య రాణి



బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):- ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యం పై తగు జాగ్రత్త తీసుకోవాలని తురకలపూడి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి విశాఖ సమాచారమ్ సంధ్య రాణి అన్నారు. ఆమె మాట్లాడారు. మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాలలో ఉష్ణోగ్రత తీవ్రత ఎక్కువ అయ్యే అవకాశం ఉందన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అవసరమైతే తప్ప ఇంటి నుండి బయటకు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలని తప్పకుండా మంచి నీళ్లు బాటిల్, మజ్జిగ, నిమ్మరసం తరచుగా తీసుకోవాలని అన్నారు. ఎవరైనా బయటకు వెళ్లేటప్పుడు తెలికపాటి దుస్తులు, కాటన్ దుస్తులు, తెల్ల దుస్తులు ధరించి వాటర్ బాటిల్స్ ను తీసుకుని వెళ్లాలన్నారు.పని చేసుకునే ప్రదేశంలో రైతులు, వ్యవసాయ కూలీలు ఇతర పనులు చేసుకునే ప్రజలు టెంట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించిన వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలి అన్నారు.

## ఘనంగా కార్పెంటర్స్ డే




నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):- మున్సిపాలిటీలోని స్థానిక అభిద్ సెంటర్ నుండి ఆర్డిఓ కార్యాలయం వరకు గురువారం కార్పెంటర్స్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఆర్డిఓ కార్యాలయం ఏవో సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సీపట్నం కార్పెంటర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి కార్పెంటర్స్ కు ఎటువంటి ఆర్థిక సహాయం అందట్లేదని, 200 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇవ్వాలని, అంగవైకల్యం కలిగిన వారికి భీమా సౌకర్యం పింఛన్లు మంజూరు చేయాలని, కార్పెంటర్ వృత్తి చేసుకునేందుకు స్థలం కేటాయించి షెడ్లు నిర్మించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పెదపాటి గోవిందరావు, జివ్వది నాగేశ్వరరావు మాస్టర్, బోగ లింగేశ్వరరావు ,సెక్రటరీ కొమ్మోజు శ్రీనివాసరావు, కన్వీనర్ పోలుమూరు బ్రహ్మజీ, జిల్లా ఉపాధ్యక్షులు కొప్పోజు శివ, చుక్క ఆనంద్, గానుగుల రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మరిడిమాంబ జాతర



రావికమతం, (విశాఖ సమాచారమ్):- మరు పాక గ్రామంలో మరిడి మాంబ తల్లి ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాల్లో విద్యుత్ దీపాలంకరణ చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నట్లుగా తెలిపారు.

## వేసవి త్రాగునీరు ఎద్దడి దృశ్య బోరు ఏర్పాటు



బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):- మండలంలోని పీ. భీమవరం గ్రామంలో పశువుల కల్లాల వద్ద నీటి ఎద్దడి ఎక్కువగా ఉండటం వలన స్థానిక టిడిపి నాయకులు పినపోలు రామదాసు, కంఠంరెడ్డి శ్రీరామమూర్తి,, పాల సంస్థ అధ్యక్షులు పలివిరెడ్డిరాజు అభ్యర్థన మేరకు 5 మంచినీటి బోర్లును మండల పరిషత్ నిధుల నుండి మన ఎమ్మెల్యే కె. రాజు ఆదేశాలు తో ఎంపిపి దాకవరపు నాగేశ్వరీ దేవి, విశాఖ డెయిరీ డైరెక్టరు గేదెల సత్యనారాయణ, మండలపార్టీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, స్థానిక ఎంపీటీసీ, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు దేవర అప్పారావు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి సభ్యులు, పి.భీమవరం కూటమి సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్

శుక్రవారం 28-3-2025

# విద్యార్థులకు అమెరికా షాక్!

అమెరికాలో ఉన్నతవిద్య, ఉద్యోగం అనేది ప్రపంచ దేశాల్లోని చాలా మంది యువత కల. ఈ కలను సాకారం చేసుకోవడం కోసం ఏటా చాలా మంది విద్యార్థులు అగ్రరాజ్యానికి వెళ్తుంటారు. గత కొంతకాలంగా ఈ విద్యార్థి వీసాల (ఎఫ్-1) జారీలో అమెరికా భారీగా కోత విధిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 41 శాతం దరఖాస్తులను తిరస్కరించింది. పదేళ్లతో పోలిస్తే ఎఫ్%-%1 వీసాల తిరస్కరణ దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. 2023-24 సంవత్సరంలో మొత్తం 6.79 లక్షల మంది ఎఫ్%-%1 వీసా కోసం దరఖాస్తు చేసుకోగా.. వీటిలో 2.79 లక్షలు (41%) తిరస్కరించారు. అంతకు ముందు ఏడాది 6.99 లక్షల దరఖాస్తుల్లో 2.53 లక్షలు (36% ) ఆమోదం పొందలేదు.

2024 మొదటి తొమ్మిది నెలల్లో భారతీయులకు జారీ చేసిన విద్యార్థి వీసాల సంఖ్య 2023తో పోలిస్తే 38% తగ్గింది. గత దశాబ్దంలో దరఖాస్తుల సంఖ్య తగ్గినప్పటికీ, వీసా తిరస్కరణల శాతం పెరిగింది. పదేళ్ల కిందట అంటే 2014-15లో 8.56 లక్షల మంది ఎఫ్-1 వీసాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత నుంచి క్రమంగా తగ్గుతూ, కోవిడ్ ఏడాదిలో (2019-2020)లో అత్యల్పంగా 1.62 లక్షలకు పడిపోయింది. కరోనా వైరస్ మహమ్మారి అదుపులోకి వచ్చిన అనంతరం దరఖాస్తుల సంఖ్య క్రమంగా పెరిగినప్పటికీ, 2023-24లో 3% తగ్గింది. 2022-23లో 6.99 లక్షల నుంచి 2023-24లో 6.79 లక్షలకు తగ్గింది. ఫలితంగా, గత ఆర్థిక సంవత్సరంలో వీసా తిరస్కరణల సంఖ్య (2.79 లక్షలు) కనీసం ఒక దశాబ్దంలోనే అత్యధికంగా నమోద్యెంది. 2023-24లో మొత్తం 4.01 లక్షలఎఫ్-1 వీసాలు జారీ చేయగా.. అంతకు ముందు ఏడాది 4.45 లక్షలుగా ఉంది. ఎఫ్-1 వీసా అనేది అమెరికాలోని విద్యా సంస్థల్లో చదువుకునే విదేశీ విద్యార్థుల కోసం ఉద్దేశించిన నాన్-ఇమ్మిగ్రెంట్ కేటగిరీ. ఈ వీసా జారీ తగ్గింపునకు ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ యాక్ట్ నిబంధనలే కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2019 నుంచి వీసా డేటాను లెక్కించే విధానంలో మార్పులే కారణమని అమెరికా అధికారి ఒకరు పేర్కొన్నారు. 'మునుపటి విధానం వర్క్‌లోడ్ చర్యల లెక్కింపుపై ఆధారపడిరది.. ఇది దరఖాస్తుకు లింక్ చేయలేదు.. కొత్త విధానం నిర్దిష్ట రిపోర్టింగ్ వ్యవధిలో వీసా దరఖాస్తు ప్రక్రియ తుది ఫలితాలను మరింత ఖచ్చితంగా ప్రతిబింబిస్తుంది' అని చెప్పారు.

ఇక, 2024 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు భారతీయులకు 64,008 విద్యార్థి వీసాలు లభించాయి. 2023లో ఇదే కాలంలో 1.03 లక్షలుగా ఉంది. అమెరికాలోని అంతర్జాతీయ విద్యార్థుల్లో భారతీయులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ఓపెన్ డోర్స్ 2024 నివేదిక ప్రకారం.. 2023-24లో భారతీయ విద్యార్థుల సంఖ్య చైనీయుల కంటే ఎక్కువగా ఉంది. భారతీయ విద్యార్థులు 3.31 లక్షల మంది ఉన్నట్టు తెలిపింది. అమెరికా విద్యా సంస్థలు ఏడాదికి రెండుసార్లు ప్రవేశాలను అనుమతిస్తాయి. ఆగస్టు- డిసెంబర్ సెమిస్టర్ సమయంలోనే భారతీయులు అధికంగా వెళ్తుంటారు. ఎఫ్-1 వీసాలను ఉద్దేశ పూర్వకంగా తగ్గించడం లేదని, నిబంధనల ప్రకారం ఉన్నాయోలేదో ఇప్పుడు కచ్చితంగా, క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నందున తిరస్కరణలు ఎక్కువగా ఉంటున్నాయని యుఎస్ఏ ఇమ్మిగ్రేషన్ అధికారులు చెబుతున్నారు.

పంచాంగం

శుక్రవారం 28-3-2025
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, శిశిరరుతువు
ఫాల్గుణ మాసం

| | |
|---|---|
| తిథి | : బ. చతుర్దశి సా. 7.56 |
| నక్షత్రం | : పూర్వాభాద్ర రా. 10.09 |
| వర్జ్యం | : ఉ. 6.19 ల 7.45 |

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# చిత్తం దోచిన చిత్తూరు నాగయ్య అభినయం!



నేడు జయంతి సందర్భంగా

తెలుగునాట బహుముఖ ప్రజ్ఞకు నిలువెత్తు నిదర్శనంగా నిలచిన తొలి సూపర్ స్టార్ ఎవరంటే? ఎక్కువ మంది ఎన్టీఆర్ పేరు చెబుతూ ఉంటారు. నిజానికి రామారావు కంటే ముందు భారతదేశంలోనే అత్యధిక పారితోషికం తీసుకుని, నటునిగా ఉన్నతశిఖరాలను అధిరోహించి, తన బహుముఖ ప్రజ్ఞను చాటుకున్న ఘనులు చిత్తూరు వి.నాగయ్య. నటునిగా, గాయకునిగా, సంగీత దర్శకునిగా, రచయితగా, నిర్మాతగా, దర్శకునిగా ఇలా తనలోని ప్రతిభను చాటుకుంటూ సాగారు నాగయ్య. ఆ రోజుల్లో తెలుగునాటనే కాదు, యావద్భారతంలోనూ అంతటి ప్రతిభాపాటవాలు ప్రదర్శించిన నటులు మరొకరు కానరారు. తెలుగు చిత్రసీమలో తొలిసారి 'పద్మశ్రీ' అవార్డు అందుకున్న గొప్ప నటుడు ఆయన. మన దేశంలో ఆ రోజుల్లోనే సినిమాకు లక్ష రూపాయల పారితో షికం పుచ్చుకున్న ఘనత కూడా ఆయనకే దక్కింది. 1940-60 దశకంలో తెలుగు, తమిళ చిత్ర పరిశ్ర మల్లో విశేషంగా రాణించిన సకల కళా వల్లభుడు 'పద్మశ్రీ' చిత్తూరు వి.నాగయ్య స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొని, భరతమాత దాస్య శృంఖలాలను తెంపడంలో తనవంతు పాత్ర పోషిం చారు. ఉప్పలదడియం నాగయ్య 1904 మార్చి 28న గుంటూరు జిల్లా రేపల్లెలో జన్మించారు. 1973 డిసెంబరు 30న చెన్నైలో కన్నుమూశారు.

అప్పట్లోనే లక్షల రూపాయలు సంపాదించిన నాగయ్య తన సంపాదనను పేదవారికోసం వినియోగించారు. చిత్రసీమలో అవకాశాల కోసం పాట్లుపడేవారికి అన్నపానీయాలన్కెనా సమకూర్చాలనే సదుద్దేశంతో ఓ భవంతిని తీసుకొని, అక్కడ ముప్పూటలా భోజనాలు ఏర్పాటు చేశారు. అంతేకాదు, అడిగిన వారికి లేదనకుండా సాయం చేశారు. సినిమాల్లో పోషించిన 'పోతన, వేమన, త్యాగయ్య' వంటి పాత్రల ప్రభావం ఆయనపైనా ఉండేది. అందుకే దానగుణం అబ్బిందనేవారు. ఆయన దానగుణం గురించి దక్షిణాది మొత్తం చర్చించుకొనేవారు. నాగయ్య నటించిన 'యోగి వేమన' చిత్రం చూసి, ఓ బాలుడు 'బాలయోగి'గా మారి జేజేలు అందుకున్నారు. అంటే నాగయ్యలోని నటుడు ప్రేక్షకులపై ఎంతటి ప్రభావం చూపించారో అర్థం చేసుకోవచ్చు.

'భక్త పోతన'లో నాగయ్య అభినయం చూసి, సాక్షాత్తు పోతనామాత్యులే దిగివచ్చారా? అన్న తీరున ఆయన నటన సాగింది. 'భక్త పోతన' సాధించిన విజయం నాగయ్యలో ఉత్సాహం నెలకొల్పింది. దాంతో స్వీయ దర్శకత్వంలో 'త్యాగయ్య' చిత్రాన్ని నటించి, నిర్మించి, సంగీతం సమకూర్చారు. ఈ సినిమా విడుదల్కె అనూహ్య విజయాన్ని మూటకట్టుకుంది. ఈ సినిమా ప్రభావంతో ఎంతోమంది తెలుగునేలపై సంగీతం పట్ల అభిమానం పెంచుకున్నారు. ముఖ్యంగా త్యాగరాజు కీర్తనలు తెలుగునేలపై మరింత ప్రాచుర్యం పొందడానికి ఈ సినిమా ఎంతగానో దోహదపడిరది. ఈ సినిమాను పండితపామర భేదం లేకుండా అందరూ ఆదరించారు. ఎందరో ఆ నాటి సంస్థానాధీశులు నాగయ్యను తమ సంస్థానాలకు ఆహ్వానించి, ఘనంగా సన్మానించారు. గజారోహణ చేశారు. అలా చిత్రసీమలో గజారోహణ అందుకున్న తొలి నటునిగా నాగయ్య నిలచిపోయారు. ఆ సినిమా తరువాత నాగయ్య కనిపిస్తే చాలు అందరూ పాదాభివందనాలు చేయడం ఆరంభించారు. ఒకానొక సమయంలో నాటి మేటి విద్యావేత్త, తరువాతి కాలంలో భారతదేశ రాష్ట్రపతిగా రాణించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ కు ఎవరో పాదాభివందనం చేశారట. ఆ పక్కనే నాగయ్య కూడా ఉన్నారట. అప్పుడు "నాలాంటి వారికి పాదాభివందనం చేసే బదులు నాగయ్యగారి లాంటి వారికి ప్రణమిల్లండి. పుణ్యమైనా దక్కుతుంది" అంటూ సర్వేపల్లి రాధాకృష్ణన్ అన్నారట. ఈ విషయాన్ని ఇప్పటికీ ఆ నాటి వారు గొప్పగా చెప్పుకుంటూ ఉంటారు. సినిమా తారల పట్ల మీడియా ప్రాచుర్యం అంతగా లేని ఆ రోజుల్లోనే నాగయ్యకు ఆ స్థాయి గౌరవం లభించడం గమనార్హం! తెలుగు, తమిళ, కన్నడ చిత్రాలలోనూ నాగయ్య నటించి మెప్పించారు. చేతికి ఎముక లేకుండా దానధర్మాలు చేసిన నాగయ్య, తరువాతి రోజుల్లో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. వాటిని అధిగమించడానికి అన్నట్టు తన స్థాయికి తగని పాత్రల్లోనూ నటించాల్సి వచ్చింది. ఏది ఏమైనా తెలుగు చిత్రసీమలో తన బహుముఖ ప్రజ్ఞతో నాగయ్య అలరించిన తీరును ఎవరూ మరచిపోలేరు.

- సుగుణ శేఖర్ రెడ్డి గుమ్మళ్ల (ఫ్రీ లాన్స్ జర్నలిస్ట్)

# ఒంటరి వృద్ధులు



"నేను వార్తాపత్రికను డెలివరీ చేస్తున్న ఇళ్లలో ఒక ఇంటి లెటర్ బాక్స్ తాళం వేసి ఉంది. అందువలన నేను వారి తలుపు తట్టాను మిస్టర్ ప్రసాద్ రావు.., అస్థిరమైన అడుగులతో నడుస్తున్న వృద్ధుడు, నెమ్మదిగా తలుపు తెరిచాడు.

నేను అడిగాను, "సార్, మీ లెటర్ బాక్స్ ఎందుకు లాక్ చేయబడింది ?"

ఉద్దేశపూర్వకంగానే లాక్ చేశాను ' అని బదులిచ్చారు.

ప్రసాదరావు చిరునవ్వుతో ఇలా చెప్పారు ,

"మీరు ప్రతి రోజూ వార్తాపత్రికను నాకు చేతికి అందించాలని నేను కోరుకుంటున్నాను.

దయచేసి తలుపు తట్టండి లేదా బెల్ కొట్టి నాకు స్వయంగా ఇవ్వండి."

నేను అయోమయంలో పడ్డాను, అలాగే అన్నాను.

కానీ అది ఇద్దరికీ అసౌకర్యం మరియు సమయం వృధాగా అనిపిస్తుంది" అని జవాబిచ్చాను.

"అదేమీ ఫర్వాలేదు%శొ% ప్రతి నెలా మీకు రూ. 500/- అదనంగా ఇస్తాను" అన్నారు .

"మీరు తలుపు తడితే నేను తలుపు తీయలేని పరిస్థితిలో ఉండే రోజు ఎప్పుడైనా వస్తే, దయచేసి పోలీసులను పిలవండి "

నేను షాక్ అయ్యి "ఎందుకు?" అని అడిగాను.

" నా భార్య చనిపోయింది, నా కొడుకు విదేశాల్లో భార్యా పిల్లలతో స్థిరపడ్డాడు.

మా కన్నా మా పిల్లలు పైకి ఎదగాలని కష్టపడి పై చదువులు విదేశాల్లో చదివవించాము.

ప్రస్తుతం నేను ఇక్కడ ఒంటరిగా జీవిస్తున్నాను, నాకు ఏ సమయం ఎప్పుడు ఎలా వస్తుందో ఎవరికి తెలుసు ?"

అలా చెబుతున్నపుడు నేను చెమర్చిన ఆ వృద్ధుడి కళ్ళు చూశాను.

ఆయన ఇంకా ఇలా అన్నారు.

"నేను వార్తాపత్రికను చదవలేను నాకు చూపు మందగించింది.

తలుపు చప్పుడు లేదా డోర్ బెల్ మోగిన శబ్దం వినడానికి నేను ఎదురు చూస్తూ ఉంటాను.

తెలిసిన వ్యక్తిని చూడటానికి మరియు కొన్ని మాటలు వారి నోటి వెంట విని ఆ రోజు గడపడాని ప్రయత్నం చేస్తూ ఉంటాను!"

అతను చేతులు జోడించి,

"చిన్నా , దయచేసి నాకు ఒక చిన్న సహాయం చేయి !

ఇదిగో నా కొడుకు ఫోన్ నంబర్

ఒక రోజు మీరు తలుపు తట్టినపుడు, నా నుండి ఎటువంటి సమాధాన రాకపోతే...

దయచేసి నా కొడుకుకు ఫోన్ చేసి విషయం తెలియజేయండి" అన్నాడు

ఇది చదివిన తరువాత నాకు నా కర్తవ్యం అర్థం అయ్యింది.

మా స్నేహితుల సర్కిల్‌లో కూడా చాలా మంది ఇళ్లలో ఒంటరిగా ఉన్న వృద్ధులు ఉన్నారు.

వృద్ధాప్యంలో ఉన్న వారు ప్రతి రోజు గుడ్ మార్నింగ్ మెసేజెస్ వాట్సాప్‌లో ఎందుకు పంపుతారని మీరు ఆశ్చర్యపోవచ్చు/ విసుగు చెందవచ్చు.

ఈ ముసోలోళ్ళకి పనీ పాటా ఏమి లేదు, ఉదయం 4 గంటల నుండే గుడ్ మార్నింగ్ మెస్సేజ్‌లు పెడతారు అనుకుంటూ ఉంటాము.

వాస్తవానికి, ఈ ఉదయం మరియు సాయంత్రం శుభాకాంక్షల యొక్క ప్రాముఖ్యత ఏమిటంటే..

ఇది భూమి మీద తమ ఉనికిని తెలియజేసే నిశ్శబ్ద సందేశం ఈ రోజుకి మేము ఇంకా బతికే ఉన్నాము అని తెలియజేసే చేదు నిజం.

దయచేసి పెద్ద వాళ్ల గుడ్ మార్నింగ్ మెస్సేజ్‌లను ఇబ్బందిగా తీసుకోవద్దు.

మనం కూడా అదే స్థితికి ఏదో ఒక రోజు వస్తాము ఎవరైనా ఒంటరి వృద్ధులు కనిపిస్తే పలకరించండి, యోగక్షేమం కనుక్కొండి... అదీ సమాజం బాధ్యతే.

## ప్రేమా! ప్రేమా!!

అంతలా ఏం పాపం
చేసిందీ ప్రేమ
ఎన్ని నిరాకరణలు
ఎన్ని ఓటములు
ఎన్ని శోకాలు
ఎన్ని గాయాలు
ఎన్ని బాధలు
ఎన్ని ఆవేదనలు
ఎన్ని కోల్పోవడాలు
ఇంకా ఎన్నెన్నో....
అయినా ఈ ప్రేమ
బతికే ఉంటోంది.
నిముషానికో మారు
రంగులు మార్చే
ఈ మనుషులను చూసి
నవ్వుతూ....
ఇదే ప్రేమ అని
విడమరిచి చెప్పడానికి
మాటలేమీ లేవు
ఇంతే ప్రేమ అని చెప్పేందుకు
తూకమేదీ లేదు
ఇలాగే నిన్ను ప్రేమిస్తున్నాను
అని చెప్పడానికి
నిబంధనలూ
నియమాలూ ఏమీ లేవు
ప్రేమించాను
ప్రేమిస్తున్నాను
ప్రేమిస్తాను
నాకు తెలిసిందిదే..!
ఇంతకన్నా ఇంకేం చెప్పనూ?!
ఇంకెలా చెప్పనూ?!
"ఎప్పుడు చూసినా
మాట్లాడేందుకు
టైమ్ లేదు అని
చెప్పే" అతనితో
ఎప్పుడూ మాట్లాడాలని నిరీక్షించే
ఆమె అడిగింది...
"రోజూ ఐదు నిముషాల చొప్పున
మాట్లాడేలా ఒప్పందం
చేసుకుందామా" అని' ?
జీవితం కొందరికి
అన్నింటినీ
ఓ చిన్న టీస్పూన్లో
మందులా
మోతాదు చొప్పున
ఇస్తుంది....?
ప్రేమలనూ
ఆప్యాయతలనూ
సమాధానాలనూ.....

- యామిజాల జగదీశ్

# జర్నలిస్టులు అనే జీవులు కనిపించకుండా పోతారా!?

రిపోర్టర్లు లేరు. సబ్ ఎడిటర్లు లేరు. ప్రూఫ్ రీడర్లు లేరు. పేజీ మేకప్ అర్టిస్టుల్లేరు. ఫోటోగ్రాఫర్లు లేరు. ఐనా సరే, డెయిలీ పేపర్ పబ్లిషైంది ప్రింట్ ఎడిషన్, డిజిటల్ ఎడిషన్ మార్కెట్‌లోకి వచ్చేశాయి.

నిజం "ఇల్ ఫోగ్లియో" అనే ఇటాలియన్ పత్రిక తొలిసారిగా పూర్తిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో ఒక ఎడిషన్‌ను ప్రచురించడం ద్వారా చరిత్ర సృష్టించింది. ఈ ప్రయోగం 2025 మార్చి 18 నుంచి ప్రారంభమైంది, ఒక నెలపాటు కొనసాగుతుంది.



అంటే ఇక జర్నలిస్టులు కనిపించరా..? ఆ వృత్తికి మంగళం పాడినట్టేనా..? వీళ్లందరూ వేరే వృత్తులు వెతుక్కోవల్సిందేనా..? అసలే ప్రింట్ మీడియా రోజులు లెక్కపెట్టుకుంటోంది. ఇక ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కూడా పిడుగుపాటుగా మారనుందా..?

అనేక రంగాల్లో ఏఐ ప్రవేశించాక కొలువులు పోతున్నాయి. ఏఐ ఆ స్థానాల్ని ఆక్రమిస్తోంది. జర్నలిజం గతి కూడా అంతేనా..? ఇదీ ఓ ప్రశ్న. ముందుగా ఆ ఏఐ డెయిలీ గురించి నాలుగు ముక్కలు.

ఈ ప్రత్యేక ఏఐ ఎడిషన్, "ఇల్ ఫోగ్లియో ఏఐ" పేరుతో, నాలుగు పేజీలతో కూడిన ఒక సప్లిమెంట్‌గా రూపొందించబడింది, ఈ పత్రిక రోజువారీ వార్తలు, విశ్లేషణలు, సంపాదకీయాలు మరియు పాఠకుల నుంచి వచ్చిన లేఖలను కూడా ఏఐ ద్వారా రూపొందించింది.

**ప్రాజెక్ట్ ఉద్దేశం:** ఈ ప్రయోగం జర్నలిజంలో ఏఐ యొక్క ప్రభావాన్ని పరీక్షించడానికి మరియు దాని ఉపయోగాన్ని ఆచరణాత్మకంగా అర్థం చేసుకోవడానికి రూపొందించబడింది. పత్రిక సంపాదకుడు క్లాడియో సెరాసా దీనిని "జర్నలిజాన్ని పునరుజ్జీవింపజేయడం" కోసం ఒక అవకాశంగా చూశారు, అది దాన్ని నాశనం చేయడానికి కాదని పేర్కొన్నారు.

**కంటెంట్ :** మొదటి ఎడిషన్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సంబంధించిన ఒక కథనం, "పుతిన్, ది 10 బిట్రేయల్స్" అనే వ్యాసం (రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ యొక్క 20 ఏళ్ల వాగ్దాన ఉల్లంఘనలు), ఇటలీ ఆర్థిక వ్యవస్థ గురించి ఒక సానుకూల కథనం, యువ యూరోపియన్లలో "సిచుయేషన్‌షిప్స్" (స్థిరమైన సంబం ధాలకు దూరంగా ఉండే ధోరణి) గురించిన విశ్లేషణ ఉన్నాయి.

చివరి పేజీలో ఏఐ రాసిన పాఠకుల లేఖలు కూడా ఉన్నాయి, వాటిలో ఒకటి "ఏఐ మనుషులను నిష్ప్రయోజనం చేస్తుందా?" అని ప్రశ్నించింది.

**ప్రక్రియ :** జర్నలిస్టులు ఏఐ టూల్స్‌కు ప్రశ్నలు వేయడం, ఆ సమాధానాలను చదవడం మాత్రమే చేశారు. వ్యాసాలు, శీర్షికలు, కోట్స్, సారాంశాలు అన్నీ ఏఐ ద్వారా రూపొందించబడ్డాయి. వ్యాసాలు స్పష్టంగా, వ్యాకరణ దోషాలు లేకుండా ఉన్నప్పటికీ, మానవుల నుంచి నేరుగా కోట్స్ లేకపోవడం ఒక పరిమితిగా కనిపించింది.

**ప్రభావం :** మొదటి రోజు పత్రిక అమ్మకాలు 60% పెరిగాయని సెరాసా తెలిపారు. ఈ ప్రయోగం కొత్త పాఠకులను ఆకర్షించింది మరియు జర్నలిజంలో ఏఐ సామర్థ్యంపై చర్చను రేకెత్తించింది.

ఐతే నిజంగానే ఇది జర్నలిజానికి చరమగీతం పాడుతుందా సమీప భవిష్యత్తులో ఇదీ అసలు ప్రశ్న. ఒక ఉదాహరణ ముందుగా చెప్పుకుందాం. ఏఐ ఆధారితంగా ఆమధ్య టీవీ న్యూస్ రీడింగ్ చేయించారు గుర్తుందా..? ఏమైంది..? దిక్కూమొక్కూ లేకుండా కొట్టుకుపోయింది ఆ ప్రయోగం. ఒరిజినల్ ఒరిజినలే, ఆర్టిఫిషియల్ ఆర్టిఫిషియలే.

ఏఐ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోంది, ఇల్ ఫోగ్లియో ప్రయోగం దీనికి ఒక ఉదాహరణ. ఏఐ సాధారణ వార్తల రచన, సారాంశాలు, డేటా విశ్లేషణలు వంటి పనులను త్వరగా, తక్కువ ఖర్చుతో చేయగలదు. కానీ, కొన్ని కీలక అంశాల్లో జర్నలిస్టుల పాత్ర ఇప్పటికీ అనివార్యం.

**ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం :** ఏఐ ఇంటర్వ్యూలు చేయలేదు, మానవ సోర్స్‌ల నుంచి సమాచారం సేకరించలేదు లేదా సంక్లిష్ట కథనాలను వెలికితీయలేదు. ఇవి జర్నలిస్టుల సృజనాత్మకత మరియు నైతిక ఆలోచనలపై ఆధారపడతాయి.

**నైతికత, బాధ్యత:** ఏఐ వాస్తవాలను తప్పుగా అర్థం చేసుకోవచ్చు లేదా సందర్భాన్ని పట్టించుకోకపోవచ్చు. మానవ జర్నలిస్టుల ద్వారా వాస్త వాలను తనిఖీ చేయడం, నిష్పాక్షికతను నిర్వహించడం ఉంటుంది.

**సృజనాత్మకత :** ఏఐ రాసిన వ్యాసాలు సాంకేతికంగా సరైనవైనా, మానవ జర్నలిస్టులు అందించే లోతైన అంతర్దృష్టి, భావోద్వేగ సంబంధం లేకపోవచ్చు.

సెరాసా అభిప్రాయం ఏమిటంటే..? "ఏఐ మానవులతో పోటీపడగలదు, కానీ దీర్ఘకాలంలో ఈ పోటీ సామర్థ్యాన్ని పెంచాలి" అని. భవిష్యత్తులో, ఏఐ రొటీన్ పనులను చేస్తుండగా, జర్నలిస్టులు మరింత సృజనాత్మకంగా, విమర్శనాత్మకంగా ఆలోచించే పాత్రలకు మారవచ్చు. కాబట్టి, జర్నలిస్టుల అవసరం పూర్తిగా తొలగిపోక పోవచ్చు, కానీ వారి పనితీరు ఖచ్చితంగా మారుతుంది.

## చరిత్రలో ఈ రోజు (మార్చి 28)

**సంఘటనలు**

1955: ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా బెజవాడ గోపాలరెడ్డి పదవీబాధ్యతల స్వీకరణ.

**జననాలు:**

1868: మాక్సిం గోర్కీ, రష్యన్ రచయిత.

1904: చిత్తూరు నాగయ్య, తెలుగు సినిమా నటుడు.

1914: పుట్టపర్తి నారాయణాచార్యులు, తెలుగు కవి

1923: జిల్లెళ్ళమూడి అమ్మ, ఈవిడ వేదాంత సూత్రం, ప్రపంచమంతా ఒక్కటే, ఒక్కడే దేవుడు. ఈవిడ 1960-70 లలో చాలా ప్రసిద్ధురాలు

1944: బి.వసంత , నేపథ్య గాయని.

1948: ఐ.వి.శశి , దక్షిణ భారత చలన చిత్ర దర్శకుడు

1954: మూన్ మూన్ సేన్, భారతీయ సినీ నటీ, టీ వీ నటీ,రాజకీయ నాయకురాలు .

1982: సోనియా అగర్వాల్, తమిళ,తెలుగు, చిత్రాల నటి , మోడల్.

1997: అనూ ఇమ్మానియేలు , భారతీయ చలనచిత్ర నటి

**మరణాలు:**

1552: భారత సిక్కు గురువు గురు అంగద్ దేవ్ .

1933: గుత్తి కేశవపిళ్లై, భారతీయ పాత్రికేయుడు, రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు.

1959: కళా వెంకటరావు, స్వాంతంత్ర్య యోధుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి.

1962: కోరాడ రామకృష్ణయ్య, భాషావేత్త, తెలుగు-సంస్కృత భాషా నిపుణులు

2003: లావు బాలగంగాధరరావు, భారత కమ్యూనిస్టు పార్టీ - మార్క్సిస్టు నాయకుడు.

2006: వేదాద్రి మహర్షి, భారత తత్వవేత్త

2022: పరిపాటి జనార్దన్ రెడ్డి, రాజకీయ నాయకుడు. మాజీ ఎమ్మెల్యే.

# సుగర్ ఫ్యాక్టరీ రైతులకు బిల్లులు వెంటనే చెల్లించాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):–** చోడవరం సహకార చక్కర కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు రైతులకు చెరకు బకాయిలు చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్కు ఆయన రాసిన లేఖను విడుదల చేశారు. జిల్లాలో తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల క్రషింగ్ నిలిపివేశాక, చెరకు రైతుకు పెద్ద దిక్కుగా చోడవరం సహకార సుగర్ ఫ్యాక్టరీ వుంది. ఈ ఫ్యాక్టరీని నమ్ముకొని చెరకు సాగుచేసి సరఫరా చేస్తున్నారు. ఈ ఏడాది క్రషింగ్ ప్రారంభం నుంచి నేటి వరకు చెరకు సరఫరా చేసిన రైతుకు యాజమాన్యం పైసా బిల్లు చెల్లించలేదు. దీంతో కుటుంబ అవసరాలకు, పెట్టుబడులకు వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. గతేడాది బకాయి రూ.7.16 కోట్లు, ఈ ఏడాది బకాయి బిల్లు రూ.25.14 కోట్లు టటతుకు చెల్లించాల్సి వుంది. అలాగే కార్మికులకు రూ.7 కోట్లు జీతం బకాయివుంది. ఈ ఏడాది ఫ్యాక్టరీ క్రషింగ్ ఆరంభం నుంచి కార్మికులకు జీతం చెల్లించలేదు. రైతు, కార్మిక కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులుపడుతున్నాయి. తమరు జోక్యం చేసుకొని రైతులు, కార్మికుల బకాయి బిల్లులు, జీతాలు చెల్లింపునకు తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తిచేస్తున్నాను. ఫ్యాక్టరీలో రూ.17 కోట్ల విలువైన పంచదార నిల్వలు, రూ.8 కోట్లు విలువైన మొలాసిస్ విక్రయానికి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి. రైతు, కార్మికుల సమస్యలను మానవతాధృక్పథంతో ఆలోచించి బకాయి బిల్లులు చెల్లించి రైతు, కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నాం.

# Spoken English -12

Planning my summer vacation.- వేసవి సెలవులకు ఎక్కడకు వెళ్ళాలా అని ఆలోచిస్తున్నాను.

Nothing much.- ఎక్కువగా కాదు.

16. WHAT'S THE MATTER?- ఏంటీ సమస్య?

(This means "What's the problem?" – you can ask it to someone who appears sad or upset.)

Oh, I'm just having a rough day.- –ఓ..ఈ రోజు నాకు బాగోలేదు.

(A "rough day" means a difficult, bad day.)

I'm not feeling so good.-. నాకు మంచిగా లేదు.

I just found out my mother's in the hospital.- మా అమ్మ హాస్పిటల్ లో వున్నాదని విన్నాను.

(The phrasal verb "found out" means "discovered or heard some new information.")

I'd rather not talk about it.- నేను దీని గురించి మాట్లాడదలచుకో లేదు.

(This means "I'd prefer not to talk about it.")

Nothing, I'm fine.- ఏమీ లేదు. నేను క్షేమం.

© Restaurant Questions In English ©

17. WHAT WOULD YOU LIKE TO DRINK?- త్రాగడానికి నీవు దేనిని ఇష్టపడతావు?

Iced tea, please.- ఐస్ టీను..

Just water for me.- కొద్దిగా నీళ్ళు తీసుకు రా.

What do you have? - నీకు ఏ కావాలి?

Could we see the wine list?- వైన్ లిస్ట్ చూపెట్టగలరా?

Nothing for me, thanks.- నాకు ఏమీ వద్దు. ధన్యవాదాలు.

18. ARE YOU READY TO ORDER?- ఆర్డర్ చేయడానికి సిద్ధంగా వున్నారా?

(To "order" means to ask the waiter/waitress for the food you want to eat.)

Not quite – I think we need a little more time.- అప్పుడే కాదు. మరి కొంత సమయం పట్టవచ్చును.

What are the specials today?- ఈ రోజు ప్రత్యేక ఐటెంలు/వంటలు ఏమిటి?

("Specials" are featured dishes that might also have a discount.)

Yes, I'll have a Caesar salad and then the baked chicken with potatoes.- అవును, నాకు కైజర్ సలాడ్ మరియు పొటాటో కలిపిన బేక్ డ్ చికెన్ కావాలి.

(The most common way to order food is to say "I'll have…"-)

Uh-huh. To start off, we'll split an order of nachos.

"To start off" means you are ordering an appetizer (small amount of food eaten before the main meal). ?="Split" means that two or more people will share/divide one order of food.)

19. IS EVERYTHING OK?= అంతా ఓకేనా?

(While you are eating, the waiter/waitress will often come to your table and ask this question to check if you need anything.)

Yes, everything's fine, thanks.- ఎస్! ప్రతీది బావుంది.

It's all delicious!- అన్నీ రుచిగా వున్నాయి.

Could we have some more water, please?- ఇంకొంచెం వాటర్ తెస్తారా, ప్లీజ్?

("Could we have…" is a polite way to ask for something.)

Actually, I'm still waiting for my side dish.- నిజానికి ప్రక్క నున్న చిన్న డిష్ కోసం నేను ఇంకా ఎదురు చూస్తున్నాను.

(A "side dish" is a small portion of food that accompanies the main meal.)

To be honest, my food is kinda cold. Could you heat it up? - నిజాయితీగా చెప్పాలంటే నా ఆహారం చల్లగా వుంది. కొద్దిగా వేడి చేస్తారా?

("To be honest…" is a diplomatic way to introduce a complaint or negative comment.)

20. CAN I GET YOU ANYTHING ELSE?- నేను మీ కోసం ఇంకేమైనా తీసుకు రావాలా?

(The waiter/waitress will probably ask you this after you have finished eating.)

Two decaf coffees, please.-దయచేసి రెండు కెఫిన్ లేని కాఫీలు తీసుకు రండి

("Decaf coffee" is coffee with no caffeine.)

Just the check, please.- దయచేసి సరి చూసుకోండి.

(The "check" is the list of items and the total price to pay.)

Could I have a look at the dessert menu?- మిగిలిపోయిన మెనూ లిస్ట్ ను చూడవచ్చా?

I'll have a slice of apple pie.- నాకు యాపిల్ ముక్క కావాలి?

(A "slice" is a single piece of a pie, cake, or pizza.)

No thanks – I think we're just about done.- అన్నీ చేయవలసివుంటుఃదని అనుకుంటున్నాము.

**By Dr.P.V.Ram, Visakhapatnam. 9553574250**

# టెర్రరిస్టుల దాడులపై అవగాహన కలిగి ఉండాలి

## ఆక్టోపస్ సేవలపై సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** అనుకోని రీతిలో జరిగే టెర్రరిస్టుల దాడులపై అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా ఉంటూ ఎదుర్కోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల వద్ద తగిన సన్నద్ధత ఏర్పాట్లు చేసుకోవాలని, భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు లేదా టెర్రరిస్టుల నుంచి జరిగే ప్రమాదాల విషయంలో అందరినీ అలర్ట్ చేసే విధంగా అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యతకత ఉందన్నారు. ఆక్టోపస్ సేవలపై సమీక్షలో భాగంగా గురువారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో ఆయన అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఆక్టోపస్ రాష్ట్ర ఆపరేషన్ అధికారి, డీఎస్పీ జగ్గునాయుడు, ఇన్ ఛార్జి అధికారి, డీఎస్పీ మధుసూధనరావులు ముందుగా ఆ సంస్థ ద్వారా అందే సేవలను విపులంగా వివరించారు. ఊహించని ప్రమాదాల నుంచి ప్రలజకు సంపూర్ణ రక్షణ కల్పించేందుకు ఆక్టోపస్ పని చేస్తోందని, రాష్ట్రంలోని తిరుపతి, గన్నవరం కేంద్రాలుగా రెండు ఆపరేషన్ యూనిట్లు సేవలందిస్తున్నాయని, మూడో యూనిట్ విశాఖపట్టణంలో నెలకొల్పేందుకు యోచిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆక్టోపస్ శిక్షణ, ఇతర కార్యక్రమాలకు సంబంధించిన వీడియోను ప్రదర్శించారు.

జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ప్రజల రక్షణకు సంబంధించి ఆక్టోపస్ అభినందనీయమైన సేవలందిస్తోందని ప్రశంసించారు. ఆక్టోపస్ ద్వారా అందే సేవలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, అనుకోని ప్రమాదాల సమయంలో ఎలా వ్యవహరించాలి, ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై సంబంధిత అధికారుల ద్వారా తెలుసుకోవాలన్నారు. టెర్రరిస్టుల నుంచి ఊహించని రీతిలో ఏదైనా ప్రమాదం వాటిల్లితే అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి దాడులను ఎదుర్కోవాలని చెప్పారు. ఫైర్, విద్యుత్, వైద్యారోగ్య, పోలీస్, ట్రాఫిక్, రెవెన్యూ సిబ్బంది, అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ నష్టం వాటిల్లకుండా జాగ్రత్త వహించాలని డీఆర్వో సూచించారు. 1971 పాకిస్థాన్ దాడి, ముంబయిలో తాజ్ పై జరిగిన దాడులు, హైదరాబాద్ గోకుల్ చాట్, లుంబినీ పార్కు వద్ద జరిగిన దాడుల తర్వాత ఆక్టోపస్ లాంటి సంస్థల ఏర్పాటు జోరుందుకుందని, ఆంధ్రప్రదేశ్ లోని ఆక్టోపస్ మిగతా రాష్ట్రాల్లోని సంస్థల కంటే భిన్నంగా సేవలందిస్తోందని గుర్తు చేశారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఆక్టోపస్ టీం ఆధ్వర్యంలో జరిగే మాక్ డ్రిల్ కు అందరూ హాజరుకావాలని సూచించారు.

ఆక్టోపస్ ఆపరేషన్ టీం అధికారులు, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, ఈపీడీసీఎల్ ఎస్.ఈ. శ్యాంబాబు, అగ్నిమాపక శాఖ ఏడీఎఫ్వో సింహాచలం, వైద్యారోగ్య శాఖ సర్వేయిలెన్స్ అధికారి ప్రసాద్, ఆర్ & బి ఈఈ, పోలీసు, రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ పోస్టుల భర్తీకై దరఖాస్తుల ఆహ్వానం

## ఐసిడిఎస్ సిడిపిఓ జివి రమణ



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):–** చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టుల భర్తీకై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ఐసిడిఎస్ , సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారిణి జీవీ రమణ తెలిపారు . జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ఖాళీ పోస్టుల భర్తీ చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆమె తెలిపారు ప్రస్తుతం ప్రాజెక్టు పరిధిలో ఆరు పోస్టులకు గాను అందులో 1 మినీ అంగన్వాడి కార్యకర్త ,5 అంగన్వాడి ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

ఈ మేరకు మండలంలోని కిటుముల పంచాయతీ జాజులపాలెం గ్రామంలో అంగన్వాడీ ఆయా పోస్ట్ 1.,అలాగే పకాబు గ్రామంలో మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్ట్ ఒకటి ,అదేవిధంగా లోతు గడ్డ పంచాయతీ విసిరి మామిడి గ్రామంలో 1 అంగన్వాడీ ఆయా పోస్ట్ ఖాళీ ఉందన్నారు. అదేవిధంగా పిఎం జన్మన్ పథకంలో భాగంగా బలపం పంచాయితీ నూర్తిపల్లి గ్రామంలో అంగన్వాడీ ఆయా ఒకటి, కొత్తపాలెం పంచాయతీలోని దేగల పాలెం గ్రామంలో అంగన్వాడీ ఆయా ఒకటి, కుడుము సారి పంచాయతీ జడుగూరు గ్రామంలో ఒక అంగన్వాడీ ఆయా పోస్ట్ ఖాళీగా ఉందన్నారు.

ఈ నేపథ్యంలో అంగన్వాడి ఆయా మినీ అంగన్వాడి కార్యకర్తలకు ఉండవలసిన అర్హతలను ఆమె తెలియజేశారు. దరఖాస్తు చేయు అభ్యర్థులు తప్పనిసరిగా స్థానిక స్థిర నివాసము కలిగి వివాహిత స్త్రీ అభ్యర్థుల నుండి మాత్రమే దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు.

తప్పనిసరిగా పదవ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. పదవ తరగతి పాసైన అభ్యర్థి లేనిచో తదుపరి ఎక్కువ తరగతి పాసైన అభ్యర్థిని దరఖాస్తును పరిశీలించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

( ప్రీస్కూల్ టీచర్ ట్రైనింగ్ కృషి ప్రీ స్కూల్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ ఇంటర్మీడియట్ బోర్డ్ వారిచే లేదా గుర్తింపు పొందిన యూనివర్సిటీ ద్వారా పొందిన సర్టిఫికెట్లు కలిగిన వారు లేదా ఈసీఈ వర్కర్ గా పనిచేయుచున్న వారికి ప్రైవేట్ స్కూల్స్ కాన్వెంట్లు పనిచేస్తున్న వారి దరఖాస్తులు పరిగణించబడవు)

ఈ నేపథ్యంలో అర్హతలు మరియు ప్రాధాన్యతలు కలిగిన స్త్రీ అభ్యర్థులు దరఖాస్తులు తేదీ ఈనెల 26వ తేదీ నుండి ఏప్రిల్ 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా సంబంధిత శిశు అభివృద్ధి పథకం కార్యాలయమునకు నేరుగా గాని/పోస్ట్ ద్వారా గాని అందజేయవచ్చునని తెలిపారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు తిరస్కరించ బడునని తెలిపారు. అభ్యర్థులు తమ పూర్తి వివరములతో దరఖాస్తు చేయవలెనన్నారు దరఖాస్తు తో పాటు విద్యార్హతలు,కులము, నివాసము మొదలగు ధృవ పత్రములు గజిటెడ్ అధికారి చేత అటెస్టేషన్ చేయించి జతపరచాలని తెలిపారు.. నిర్దేశించిన అర్హతలు మరియు ప్రాధాన్యములకు సంబంధించిన ధ్రువీకరణ పత్రములు జతపరచబడనివి, అర్హత కొరకు పరిశీలించబడవని తెలిపారు ఈ మేరకు అర్హత పొందిన అభ్యర్థులకు మౌఖిక పరీక్ష తేదీ స్థలం తెలియజేయబడుతుందని తెలియజేశారు.. ఈ నేపథ్యంలో అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణయించిన తేదీలలో హాజరు కావాలని ఆమే సూచించారు. జిల్లా స్థాయి కమిటీ ,మౌఖిక పరీక్ష నిర్వహించి, అర్హులైన అభ్యర్థులను నిర్దేశించిన పారామీటర్స్ ప్రకారం పారదర్శకంగా ఎంపిక చేయనున్నట్లు సిడి పి ఓ తెలిపారు.

# అనకాపల్లిలో 24 డేస్ సినిమా షూటింగ్

## సందడిగా మారిన కూరగాయల మార్కెట్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):–** పట్టణంలోని గాంధీ కూరగాయల మార్కెట్లో గురువారం 24 డేస్ అనే సినిమా షూటింగ్ జరుగుతోంది. దీంతో మార్కెట్ లో సందడి నెలకొంది. సిరి మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎన్ని శ్రీనివాస్ నిర్మాణ సారధ్యంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటుంది. రచయిత దర్శకుడు కిరణ్ వారియర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. దర్శకుడు కిరణ్ కు ఇది రెండవ చిత్రం గత ఏడాది మెగాస్టార్ ఫ్యాన్ అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. నవంబర్ 29న చిత్రం రిలీజై విజయవంతంగా నడిచింది. ప్రస్తుతం గాంధీ మార్కెట్లో పోరాట సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. నూతన నటి నటులతో నిర్మిస్తున్న ఈ సినిమాలో ఎన్ని రోహిత్, జీవన్, సందీప్, కాశీరాం, లోవరాజు ఐదుగురు హీరోలుగా నటిస్తున్నారు. హీరోయిన్గా సోనమ్ నటిస్తున్నారు . చిత్రం ఆద్యంతం హర్రర్ కామెడీ నేపథ్యంలో సాగుతుందని దర్శకుడు కిరణ్ వారియర్ తెలిపారు. చిత్రాన్ని నిర్మాత మే 24న రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని కిరణ్ వారియర్ తెలిపారు. షూటింగ్ కు సహకరించిన పట్టణ పోలీసులకు, లాలం కన్నాజీకి దర్శకుడు కిరణ్ వారియర్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# చురుకుగా సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**కసింకోట, (విశాఖ సమాచారమ్):–** మండలం లోని చింతలపాలెం గ్రామంలో మాజీ మంత్రివర్యులు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు అనకాపల్లి నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ & ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏపియుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆదేశాల మేరకు అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) ప్రోత్సాహంతో చింతలపాలెం చంద్రబాబు నాయుడు కాలనీలో ఎం.జి.ఎన్.ఆర్.జి.ఎస్ మ్యాచింగ్ గ్రాండ్ తో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. కసింకోట మండలం డి ఈ వేణుగోపాల్ సిసి రోడ్ నిర్మాణ పనులను పరిరక్షించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకునాయుడు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఆనాల తాతిల నాయుడు, కోర్ కమిటీ సభ్యులు , కమిటీ మెంబర్ నెంబరు తెరపల్లి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ బల్ల అప్పలకొండ, జగత మాలి నాయుడు,టీ ఈ మురళి, వి ఆర్ పి లక్ష్మి మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ సమాచారం

## ఎన్హెచ్ఎస్ఆర్సీఎల్లో ఉద్యోగాలు




నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన ఖాళీగా ఉన్న చీఫ్ ఫెసిలిటీ కంట్రోలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏప్రిల్ 15వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టు పేరు – ఖాళీలు

1. డిప్యూటీ చీఫ్ ఫెసిలిటీ కంట్రోలర్(సివిల్): 02
2. డిప్యూటీ చీఫ్ ఫెసిలిటీ కంట్రోలర్(ట్రాక్): 01
3. డిప్యూటీ చీఫ్ కంట్రోలర్(ఎలక్ట్రికల్): 03
4. డిప్యూటీ చీఫ్ కంట్రోలర్(ఎస్ అండ్ టీ): 03
5. డిప్యూటీ చీఫ్ ట్రైన్ అండ్ క్ర్యూ కంట్రోలర్(రోలింగ్ స్టాక్): 02
6. డిప్యూటీ చీఫ్ ట్రైన్ అండ్ క్ర్యూ కంట్రోల్(ట్రైన్ ఆపరేషన్స్): 03
7. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ అండ్ ప్యాసెంజర్ కంట్రోలర్: 06

మొత్తం ఖాళీల సంఖ్య: 20

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ, బీటెక్లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి ఉండాలి.

వయోపరిమితి: 45 ఏళ్లు.

జీతం: నెలకు రూ.46,000 – రూ.1,45,000.

దరఖాస్తు ప్రక్రియ: ఆన్లైన్ ద్వారా.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.400, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు చివరి తేదీ: 15-04-2025.

## ఎన్హెచ్ఎస్ఆర్సీఎల్ జాయింట్ జనరల్ మేనేజర్ ఖాళీలు




నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన ఖాళీగా ఉన్న జాయింట్ జనరల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏప్రిల్ 15వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**పోస్టు పేరు – ఖాళీలు**

జాయింట్ జనరల్ మేనేజర్: 02

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, బీఈ, బీటెక్లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి ఉండాలి.

**వయోపరిమితి:** 45 ఏళ్లు.

**జీతం:** నెలకు రూ.90,000 – 2,40,000.

**దరఖాస్తు ప్రక్రియ:** ఆన్లైన్ ద్వారా.

**దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.400, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

**ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.

దరఖాస్తు చివరి తేదీ: 15-04-2025.

## బామర్ లారీలో మేనేజిరియల్ ఖాళీలు




భారత ప్రభుత్వరంగ సంస్థకు చెందిన పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ పరిధిలోని కోల్కతాలోని బామర్ లారీ అండ్ కో లిమిటెడ్.. రెగ్యులర్/ ఫిక్సడ్ టర్మ్ కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి ఆన్లైన్ దరఖాస్తులు కోరుతోంది.

**పోస్టుల వివరాలు: ఖాళీలు**

1. సీనియర్ మేనేజర్– 02
2. డిప్యూటీ మేనేజర్– 03
3. అసిస్టెంట్ మేనేజర్– 02
4. ఆఫీసర్– 04
5. జూనియర్ ఆఫీసర్/ ఆఫీసర్– 02

మొత్తం పోస్టుల సంఖ్య: 13

**విభాగాలు:** బ్రాండ్, అకౌంట్స్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, రైల్ ఆపరేషన్స్, కలెక్షన్స్, హైదరాబాద్, క్వాలిటీ కంట్రోల్, కీ అకౌంట్ మేనేజ్మెంట్, కలెక్షన్, ట్రావెల్.

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, ఐసీడబ్ల్యూఏ, డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ, బీ ఫార్మ్, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

**జీతం:** నెలకు ఆఫీసర్ పోస్టుకు 30 రూ.41,474బీ డిప్యూటీ మేనేజర్కు రూ.89,108బీ అసిస్టెంట్ మేనేజర్కు రూ.40,000బీ డిప్యూటీ మేనేజర్ (మార్కెటింగ్)కు రూ.50,000 సీనియర్కు మేనేజర్కు రూ.70,000.

**వయోపరిమితి:** ఆఫీసర్కు 30ఏళ్లుబీ డిప్యూటీ మేనేజర్కు 35 ఏళ్లు సీనియర్కు మేనేజర్కు 40 ఏళ్లుబీ జూనియర్ ఆఫీసర్కు 30 ఏళ్లు మించకూడదు.

**జాబ్ లొకేషన్:** కోల్కతా, సిల్వెస్సా, రూర్కెలా, దిల్లీ, చెన్నై, త్రివేండ్రం, హైదరాబాదు.

**ఎంపిక విధానం:** షార్ట్లిస్టింగ్, విద్యార్హతలు, పని అనుభవం ఆధారంగా.

**దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా.

**దరఖాస్తు చివరి తేదీ:** 18-04-2025.

# వేతన బకాయిలు చెల్లించాలి




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** స్టీల్ ప్లాంట్ లో పనిచేస్తున్న కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలను తక్షణం చెల్లించాలని స్టీల్ సిఐటీయు గౌరవ అధ్యక్షులు జె అయోధ్యరామ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. నేడు స్టీల్ సిఐటీయు ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట' తక్షణం వేతన బకాయిలు చెల్లించాలి', 'హెచ్ఆర్ఏ పునరుద్ధరించాలి', 'పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలి' అనే ప్రధాన డిమాండ్లతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు స్టీల్ సిఐటీయు అధ్యక్షులు వైటి దాస్ అధ్యక్షుడు వహించారు.

ఈ ధర్నా నుద్దేశించి జె అయోధ్యరామ్ మాట్లాడుతూ గడచిన ఏడు మాసాలుగా స్టీల్ కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలపై ప్రతిష్టంబనను యాజమాన్యం సృష్టిస్తుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇదే సమయంలో గడచిన నాలుగు మాసాలుగా 10200 కోట్ల రూపాయలను ఉత్పత్తులు చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అర్థ ఆకలితో కార్మికులు కష్టించి పని చేస్తుంటే వారి కష్టాన్ని దోచుకునే పనిలో ప్రభుత్వ యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయని ఆయన వివరించారు. అలాగే హెచ్ ఆర్ ఎ ను పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకునే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా విద్యుత్ చార్జీలను 16 రెట్లు పెంచిన యాజమాన్యం వాటిని తక్షణం రద్దు చేయాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు.

స్టీల్ సిఐటీయు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించింది కానీ దానిలో ఉద్యోగులకు మరియు ఉత్పత్తికి అవసరమైన నిధులు కేటాయింపులో ప్రభుత్వం తన వైఖరిని ప్రదర్శించిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇది పూర్తిస్థాయి ఉత్పత్తికి అవసరమైన ముడి ఖనిజాన్ని, ఈ నిధులను సరియైన పద్ధతిలో వినియోగించే విషయంలో యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలు అనేక అనుమానాలు కలిగిస్తున్నాయని ఆయన వివరించారు. కనుక కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేసి ఈ కర్మాగారాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటీయు నాయకులు పి శ్రీనివాసరాజు, బి అప్పారావు, టివి కె రాజు, కె గంగాధర్, నీలకంఠం, పుల్లారావు,కె వి సత్యనారాయణ, ముని వెంకటరమణ, ఎ శ్రీనివాస్, అప్పారావు, దుర్గాప్రసాద్ తదితరులతో పాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# హిందీ నేర్చుకోండి, దేశాన్ని కలిపి ఉంచండి : డా. సుష్మా చౌగలే



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** విశాఖపట్టణంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో జరిగిన జాతీయ సదస్సులో కోల్హాపూర్ మహావీర్ మహావిద్యాలయం నుండి విచ్చేసిన ముఖ్య వక్త డా. సుష్మా చౌగలే " ప్రయోజనాత్మక హిందీ మరియు ఆచరణాత్మక వైఖరి" అనే విషయంపై విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ కార్యక్రమానికి హిందీ విభాగాధిపతి డా. పి.కె. జయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఆమె స్వాగత ప్రసంగంతో పాటు ముఖ్య అతిథి పరిచయాన్ని అందించారు. హిందీ భాష ఉపయోగాలను వివరిస్తూ, హిందీ భాష వ్యావహారికంగాను, వృత్తిపరంగాను ఎలా ఉపయోగపడుతుందో విశదంగా వివరించారు.

హిందీ భాష ఒక సంబంధం మరియు సంభాషణ భాష మాత్రమే కాకుండా, ఉద్యోగ అవకాశాల కలిగించే భాషగాను ఉందని విద్యార్థులకు తెలియజేశారు. రాజభాష అధికారి, హిందీ అనువాదకుడు, స్క్రిప్ట్ రైటర్, హిందీ ఉపాధ్యాయుడు వంటి ఉద్యోగ అవకాశాలను వివరించారు.

డిజిటల్ మీడియా గురించి తెలియజేస్తూ, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, బ్లాగ్స్, కంటెంట్ క్రియేటర్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా, డబ్బు సంపాదనకు కూడా ఉపయోగపడతాయని వివరించారు. దీని కోసం భాషపై పట్టుతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అవసరమని తెలిపారు.

ప్రతి వ్యక్తిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది, కాబట్టి తనలోని సామర్థ్యాన్ని గుర్తించుకోవాలని, ప్రపంచీకరణ యుగంలో కంటెంట్ రైటింగ్ ద్వారా డిజిటల్ వేదికల్లో ఉపయోగించి, మంచి ఆదాయాన్ని పొందవచ్చని చెప్పారు. ఇందులో యూట్యూబ్ ఒక శక్తివంతమైన మాధ్యమమని అన్నారు.

"హిందీ నేర్చుకోండి, ముందుకు సాగండి, భారతాన్ని కలిపి ఉంచండి" అంటూ విద్యార్థులకు ప్రేరణ ఇచ్చారు. అనంతరం, డా. సుష్మా చౌగలే గారిని అధ్యాపకులు సన్మానించారు.

ఈ ప్రత్యేక ఉపన్యాసానికి డా. జయలక్ష్మి, డా. దీప్తి, డా. రాజేంద్ర రాటే, డా. కోటేశ్వరరావు, అలాగే సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల డిగ్రీ విద్యార్థినులు హాజరయ్యారు. డా. దీప్తి వందన సమర్పణ చేసారు.

# త్రూ ఆప్ ఛార్జీల పెంపును వెంటనే ఉప సంహరించుకోవాలి

## స్మార్ట్ మీటర్ల బిగింపును వెనుకకు తీసుకోవాలి ,సిపిఎం



**దేవరపల్లి, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్రంలో త్రూ ఆప్ చార్జీలు పెంపును వెంటనే ఉప సంహరించు కోవాలని స్మార్ట్ మీటర్ల బిగింపును వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేస్తు సిపిఎం పార్టీ అద్వర్యంలో దేవరాపల్లి ఎలక్ట్రికల్ ఆఫీసు వద్ద గురువారం ధర్నా కార్యక్రమం చేపట్టి ఎలక్ట్రికల్ ఎఇ కర్రి శంకర్ రావు కు వినతి పత్రం సమర్పించారు అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న మాట్లాడారు రాష్ట్రలో విద్యుత్ ఛార్జీల పెంపుకు ఇఆర్సి ఓకే చెప్పిందని తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ. 9,412 కోట్ల ఇంధన సర్దుబాటు ఛార్జీలను వసూలు చేయాలని ఆదేశించిందని అన్నారు ఇది అత్యంత దుర్మార్గపు ఆలోచన అని దుయ్య బట్టారు,యూనిట్ కు 92 పైసల చొప్పున వసూలు చేయాలని, నిర్ణించిందని తెలిపారు. దాదాపు రూ.7,912 కోట్లు ప్రజలపై భారం మోప నుందని తెలిపారు మరోవైపు విద్యుత్ చార్జీలు పెంచభోమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలు చేస్తుందని తెలిపారు సూపర్ సిక్స్, హమిలుతో అదికారిలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ ఇలా ప్రజలును నమ్మించి మోసం చేయడం అన్యాయ మన్నారు మద్యం ధర తగ్గించినట్లు చేప్పి 14 శాతం పెంచే సిందని అన్నారు మరో వైపు ప్రభుత్వ విద్యుత్ చార్జీలు పెంచడం ప్రజలు పై బారాలు వేయడం సిగ్గు చేటన్నారు,మంచి నూనె పప్పు వెళ్ళుళ్ళి, కంది పప్పుతో పాటు అన్ని రకాల నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగి పోయాయని తెలిపారు ,రైతులు పండించిన పంటలకు మాత్రం మద్దతు ధర కూలిలకు కూలి రేట్లు మాత్రం పెరగ లెదన్నారు,ఇప్పటికే స్మార్ట్ మీటర్ల బిగింపును వేగ వంతం చేసిందని తెలిపారు ఒక మీటరు రేటు పదిహేను వేలు నుండి ముప్పై వేలు రూపాయలు ఖర్చుతో అదాని కంపెనీకి అప్పగించిందని సోంత విద్యుత్ లైన్లుకు అనుమతి ఇచ్చిందని తెలిపారు ,రానున్న రోజుల్లో ఈమీటర్లు సేల్ ఫోన్ టివి డిస్ మాదిరిగా రిచార్జి చేసు కోవడంతో పాటు, మీటరు ఖరీదు బిల్లుతో వాయిదా పద్దతిలో ప్రతి నెల కట్ట వలసిన ఉంటుందని తెలిపారు, విద్యుత్ చార్జీలు పెరగడం వలన విద్యుత్ పై తయారు అయ్యే ప్రతి వస్తువు ధరలు పెరుగు తాయని ప్రజలుపై మరింత ధరలు బారాలు పడ తాయని తెలిపారు వెంటనే పెంచిన త్రూఅప్ చార్జీల పెంపును వెంటనే ఉప సంహరించు కోక పోతే ప్రజలు అగ్ర హనికి గురి కాక తప్పదని వెంకన్న హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పైడితల్లి సన్యాసి సోములు తో పాటు పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

# ఏపీడబ్ల్యూజేఎఫ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

## అల్లూరి సీతారామ రాజు జిల్లా అధ్యక్షునిగా పిడి చక్రవర్తి ప్రధాన కార్యదర్శిగా. షేక్ రహీమ్ తుల్లా.




**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** అల్లూరి సీతారామరాజు జిల్లా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం నాడు పాడేరు కాఫీ హౌస్ భవనంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశాఖ ఉమ్మడి జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు ఆంజనేయులు వెంకటేష్ ఈశ్వర రావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు రోజురోజుకి పెరిగిపోతున్నాయని దీని ఖండించే బాధ్యత మన అందరి పైన ఉందని తెలిపారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో రిపోర్టర్గా పనిచేయడం అంటే కత్తి మీద సామేనని అలాంటి పరిస్థితుల్లో కూడా మీ విధులు మీరు నిర్వహించడం ఎంతో హర్షణీయమన్నారు.అలాగే మీ ప్రాంతంలో ఏకంగా ఉండి ఫెడరేషన్ కు దన్నుగా నిలవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చే అవకాశాలన్నీ అల్లూరి సీతారామరాజు జిల్లా రిపోర్టర్లకు కూడా వర్తించేలా మేము మీకు అండగా ఉంటామన్నారు. జర్నలిస్టుకు వర్తింపజేసే అక్రిడేషన్లు ఇళ్ల స్థలాలపై మన ఫెడరేషన్ తరుపున నిత్యం పోరాట చేస్తున్నామని ఈ పోరాటం ఎప్పటికైనా ఫలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా అల్లూరి జిల్లా ఏపీడబ్ల్యూజెఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవం ఎన్నుకున్నారు. అల్లూరు జిల్లా అధ్యక్షులుగా పిడి చక్రవర్తి (పాడేరు)ఉపాధ్యక్షులగా డి. సత్యనారాయణ (కొయ్యూరు) శెట్టి సంజీవరావు (అరకు) సిహెచ్ సుబ్బారావు (అడ్డతీగల) ప్రధాన కార్యదర్శి షేక్ రహీం తుల్లా( అరకు) సహాయ కార్యదర్శిలుగా డి రామచంద్రరావు (పాడేరు) టి వీర్రాజు (రాజ వొమ్మంగి), పి దేవుడు బాబు (పాడేరు) వి శ్రీనివాసరావు (జి మాడుగుల) కోశాధికారిగా టి. సునీల్ కుమార్ (పాడేరు,) సభ్యులుగా కే జాన్ (జిమాడుగుల) వీరితో పాటు మరికొంత మందిని ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా వివిధ మండలాల రిపోర్టర్లు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఫెడరేషన్ జిల్లా ప్రతినిధులను అల్లూరు జిల్లా నూతన కార్యవర్గం ఘనంగా సన్మానించి మోదకొండమ్మ జ్ఞాపికను అందజేశారు.

# అన్ని బ్రాంచీల విద్యార్థులు సాఫ్ట్ వేర్ రంగంలో రాణించవచ్చు

## డైట్‌లో ఘనంగా నేషనల్ కాన్ఫరెన్స్ ముగింపు ఉత్సవాలు




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ కళాశాలలో నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ అప్లికేషన్స్ ఇన్ ఎలక్ట్రికల్ సైన్సెస్-2025 ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్ఫోసిస్ డేటా సెంటర్ హెడ్, నర్రా సురేష్ విచ్చేశారు. ఆయన విద్యార్థులను ఉద్దేశించి ఉపన్యసిస్తూ అన్ని బ్రాంచిల ఇంజనీరింగ్ విద్యార్థులు సాఫ్ట్వేర్ రంగంలో రాణించవచ్చునని సుమారు 90% యువ సాంకేతిక నిపుణులకు సాఫ్ట్వేర్ ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఇంజనీరింగ్ లోని ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలని సాంకేతిక రంగంలోని సమస్యలకు తమ విషయ పరిజ్ఞానాన్ని సృజనాత్మకతను ఉపయోగించి పరిష్కారాలను కనుగొనాలని తెలిపారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విశాఖపట్నం సిటీ ఆఫ్ డెస్టినీ అని సాఫ్ట్వేర్ రంగం విశాఖపట్నంలో బాగా అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా తమను తాము నవీకరించుకోవాలని తెలిపారు. విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను జీవితంలో ఆచరణలో పెట్టాలని తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠ రావు గారు మాట్లాడుతూ తమ విషయ పరిజ్ఞానాన్ని మెరుగుపరచుకొని క్రమశిక్షణతో మెలుగుతూ మంచి ఉపాధి అవకాశాలను చేజిక్కించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్ ప్రసాద్ రెడ్డి, ఎలక్ట్రికల్ విభాగాధిపతి మరియు కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ గోపాలమ్మ, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కన్వీనర్ డాక్టర్ రమణకుమార్ జోగ , డీన్ అకాడమిక్స్ కృష్ణ నాగ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీవారి బ్రేక్ దర్శన సమయం మార్చండి

## మాజీ ఎమ్మెల్సీ బుద్ధ వినతి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామి స్వామి బ్రేక్ దర్శనం 10 గంటల సమయంలో ఇవ్వడం వలన భక్తులు ఇబ్బంది పడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. తిరుపతిలో స్వామివారిని దర్శించుకుని అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. బీపీ షుగర్ కొంత వ్యాధులు ఉన్నవారిని దృష్టిలో పెట్టుకొని ఉదయం ఐదున్నర గంటలకు బ్రేక్ దర్శనం కల్పించాలని కోరారు. బోర్డు మీటింగ్లో ఉదయం 5:30 సమయం పరిశీలిస్తామని చైర్మన్ ప్రకటన చేశారని నాగ జగదీష్ హర్షం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్, శ్రీవారి సేవా సమితి అధ్యక్షులు కొణతాల వెంకటరావు శ్రీవారు సేవకులు స్వామి వారిపై భక్తి విశ్వాసాలతో తిరుమలలో శ్రీవారికి సేవలందిస్తుంటారని శ్రీవారు సేవకులకు ఉదయం అల్పాహారం అందించాలని పది సంవత్సరాలుగా దేవస్థానానికి విజ్ఞప్తి పత్రాలు అందజేస్తున్న నేటికీ ఎటువంటి చర్యలు లేవని బి.ఆర్ నాయుడు చైర్మన్ గా ఉన్న సమయంలోనైనా సేవకులకు ఉచిత అల్పాహారం అందించే చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని చైర్మన్ కి విజ్ఞప్తి చేశామని బోర్డులో చర్చిస్తామని చైర్మన్ తెలిపారని వెంకటరావు అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ భోగలింగేశ్వర దేవస్థానం కాండ్రేగుల సత్యనారాయణ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు బాలకృష్ణ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు పోలిమేర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర జాతరకు సిద్ధమైన శ్రీ నూకంబిక దేవస్థానం





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి పండగను రాష్ట్ర పండగగా ప్రభుత్వ ప్రకటన చేయడంతో ఈ ఏడాది మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో జాతర, కొత్త అమావాస్య పండుగ, ఉగాది మహోత్సవాలు భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసామని ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు) తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈనెల 28 నుండి వచ్చేనెల 27 వరకు నెలరోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని, అమ్మవారి జాతర, కొత్త అమావాస్య పండగకు ఆలయానికి వచ్చే భక్తులకు ఏటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలను దృష్టి ఉంచుకొని ఆలయ ఆవరణ అంతా చలువ పందిర్లు, ఏర్పాటు చేశామన్నారు. క్యూ లైన్‌లో ఉండే భక్తులకు త్రాగు నీరు, మజ్జిగ ప్యాకెట్లు, చిన్నపిల్లలకు పాలు సరఫరా చేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు, ఈ ఏడాది భారీ విద్యుత్ అలంకరణ, స్టేజ్ ప్రోగ్రామ్లు, నేల వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశామని ఆయన తెలియజేశారు,ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ శాఖ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారని వీటితోపాటు మెడికల్, ఫైర్ ,జీవీఎంసీ, విద్యుత్, శాఖ అధికారులు కూడా దేవాలయ ప్రాంగణంలో ఆయా డిపార్ట్మెంట్ వాళ్లను అందుబాటులో ఉండేటట్టు ఏర్పాటు చేస్తున్నారని తెలియజేశారు.

# అయ్యన్న డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా



**కే.కోటపాడు, (విశాఖ సమాచారమ్):-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా అయ్యన్న డిగ్రీ కళాశాల, కె కోటపాడు,మాడుగుల నియోజకవర్గం నందు ఈ నెల 29న శనివారం నాడు సుమారు 17 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తునట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు తెలియజేసారు.ఈ ఇంటర్వ్యూలలో పదవ తరగతి, ఐ టి ఐ, డిప్లొమా, డిగ్రీ మరియు పి జి వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరముల వయస్సు గల యువతీ, యువకులు పాల్గొనవచ్చు అని,ఆసక్తి కలిగిని నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరములను naipunyam.ap.gov.in వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటుగా ఎక్కువ రెస్యూమేలు, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు జెరాక్స్ లతో ఉదయం 9 గంటలకు జాబు మేళా జరుగు ప్రదేశానికి హాజరు కాగలరు. మరిన్ని వివరములకు 7981102224, 94947 91935 నెంబర్ నందు సంప్రదించగలరు అని తెలియజేశారు.

# మోహన రావుకు సబ్ ఇన్స్పెక్టర్ పదోన్నతి

## సత్కారం చేసిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** అనకాపల్లి జిల్లాలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ విశేష సేవలందించిన డి.ఆర్.మోహన రావు కు సబ్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతి లభించింది. రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి ప్రమోషన్ మంజూరు చేయగా, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తన కార్యాలయంలో ప్రత్యేకంగా సత్కరించారు.ఉమ్మడి విశాఖపట్నం జిల్లా మరియు అనకాపల్లి జిల్లా పరిధిలో వివిధ హోదాల్లో అనుభవం సంపాదించి, నిబద్ధతతో విధులు నిర్వహించిన మోహన రావు ను జిల్లా ఎస్పీ గారు అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్సై వెంకన్న తదితర పోలీసు అధికారులు, సహోద్యోగులు పాల్గొని మోహన రావు కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## రైతులందరూ రిజిస్ట్రీ పోర్టల్లో నమోదు చేయించుకోవాలి



తాళ్ళపూడి, (విశాఖ సమాచారమ్):- మండలం లోని సొంత భూములు కలిగిన రైతులంతా తమ భూములు కలిగిన గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ నందు తమ ఆధార్, పొలం పాస్ బుక్, ఆధార్ కు లింక్ అయిన ఫోన్ నెంబరు గల ఫోన్ నెంబర్ లాంటి వివరాలు మార్చి 31 వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవలెనని వ్యవసాయ అధికారాణి రుచిత తెలిపారు. మండలంలో మొత్తం 6163 మంది పీఎం కిసాన్ పోర్టల్ నందు ఎన్రోల్ అవ్వగా 27:3: 2025 నాటికి 4625 (75%) మంది ఫార్మర్ రిజిస్ట్రీ నందు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారాన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో క్యాంపు మోడ్ లో ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ నందు రిజిస్ట్రేషన్ చేయటం జరుగుతోంది కాబట్టి ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోని రైతులంతా త్వరితగతిన రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవలసిందిగా రైతులకు విజ్ఞప్తి చేశారు.

## వైస్ ప్రేసిడెంట్ల ఎన్నిక



చోడవరం, (విశాఖ సమాచారమ్):- రాయపారాజుపేట లొ వార్డ్ మెంబెర్స్ 7 గుర ప్రేసిడెంట్ మొత్తమ్ 8 మంది కలిపి పసుపులేటి. రామ్ మూర్తి ఎస్/ఓ సన్యాసి రావు ని వైస్ ప్రేసిడెంట్ గా ఎన్నికోవటం జరిగింది. ఎన్నిక అనంతరం చోడవరం మండల పార్టీ ప్రిసిడెంట్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడా. నాగ గంగాధర్ గారు. రాయపూరాజు పేట సర్పంచ్ రామునాయుడు గారు సేమునాపల్లి పార్టీ పెద్దలు దాడి రమేష్ వెంకటప్పారావు జయప్రకాష్ గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు.

## 108 సూర్య నమస్కారాలు

### 20 వేలమంది గిరిజన విద్యార్థుల భాగస్వామ్యం

### బ్రోచర్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్ర బాబు



పాడేరు, (విశాఖ సమాచారమ్):- జిల్లాలో ఏప్రిల్ ఏడవ తేదీన అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 20 వేల మంది గిరిజన విద్యార్థులతో 108 సూర్య నమస్కారాలతో యోగా ప్రక్రియ చేసి రికార్డు సాధించే దిశగా జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్న విషయం విదితమే. ప్రస్తుతం రాష్ట్ర సెక్రటేరియట్ లో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లగా అందుకు సంబంధించిన బ్రోచర్ ను ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి మాట్లాడుతూ, గిరిజన విద్యార్థుల ఆరోగ్యం కోసం కలెక్టర్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐటి, మానవ వనరులు, రియల్ టైం గవర్నెన్స్ మంత్రి నారా లోకేష్, వ్యవసాయ, మార్కెటింగ్, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ, జిల్లా ఇంచార్జ్ మంత్రి వర్యులు గుమ్మడి సంధ్యా రాణి, ఎక్సైజ్ శాఖామాత్యులు కోళ్ళు రవీంద్ర, రెవిన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్, ప్రధాన కార్యదర్శి విజయానంద్, తదితరులు పాల్గొన్నారు.

## మలేషియాలో ఉన్న నా భర్తను రప్పించండి

### సభాపతికి విన్నవించిన భార్య మంగ

### విదేశం నుంచి స్వదేశానికి సభాపతి హామీ



నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):- అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం జి.నగరం గ్రామానికి చెందిన ఒమ్మి భూషణం మలేషియాలో ఉపాధి కోసం వెళ్లి చిక్కుకుపోవడం జరిగింది. ఈ అంశంపై భూషణం భార్య మంగ మరియు కుటుంబ సభ్యులు గురువారం నాడు నర్సీపట్నం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిశారు. భూషణాన్ని స్వదేశానికి తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేశారు.విషయం తెలుసుకున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఐటీ విద్యాశాఖ మంత్రి లోకేష్ పేషీకి తక్షణమే ఫోన్ చేసి వివరాలు తెలియజేశారు. ఇప్పటికే ఈ విషయం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ లోకేష్ తో చర్చించినట్టు, సంబంధిత అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి భూషణాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు.స్పీకర్ భూషణం కుటుంబ సభ్యులకు భరోసా కల్పిస్తూ, భూషణంను త్వరలోనే స్వదేశానికి తీసుకురావడానికి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భూషణం కుమారుడు సాయి, అన్నయ్య ముసలి, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు ఆర్.వై. పాత్రుడు, చిరంజీవి రాజు, యర్రంశెట్టి వెంకటరమణ, జి.కోడూరు నీటి సంఘం అధ్యక్షులు కళ్యాణ్ రాజు, టిడిపి నాయకులు నిమ్మల వెంకటరమణ, గ్రామ టిడిపి నాయకులు వైబోయిన నానాజీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

## సాయినాథ్ ఫార్మా పరిశ్రమ మూసివేతపై కార్మికుల ఆందోళన



పరవాడ, (విశాఖ సమాచారమ్):- పరవాడ. ఫార్మాసిటీలో సాయినాథ్ లైఫ్ సైన్స్ యాజమాన్యం అకారణంగా ముందస్తు అనుమతి లేకుండా పారిశ్రామిక వివాదాల చట్టాన్ని ఉల్లంఘించి పరిశ్రమను మూసివేసి కార్మికుల బకాయి వేతనాలు చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్న యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ఫార్మాసిటీలో సాయినాథ్ లైఫ్ సైన్స్ పరిశ్రమ ఎదుట కార్మికులు ఆందోళన, నిరసన కార్యక్రమం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పరవాడ తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసిల్దార్ అంబేద్కర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ యాజమాన్యం కార్మిక చట్టాల్ని ఉల్లంఘించి కార్మికుల వేతన బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం నుండి ఏ విధమైన ముందస్తు అనుమతి లేకుండా పరిశ్రమను మూసివేయడం దుర్మార్గమైన చర్య వెంటనే కార్మికులకు చట్టపరంగా రావలసిన వేతనాలు, గ్రాడ్యుటీ, ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్ చేయాలని, ఆంధ్రప్రదేశ్ లేబర్ కమిషనర్ యాజమాన్యం ప్రాసిక్యూట్ చేయమని ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని గని శెట్టి కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్, బంగారు రాజు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తెలంగాణ శాసనభలో సీఎం తీర్మానం

హైదరాబాద్, (విశాఖ సమాచారమ్):- డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తెలంగాణ శాసనభలో సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "డీలిమిటేషన్ వల్ల జనాభాను నియంత్రించిన రాష్ట్రాలు నష్టపోకూడదు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలనే కొనసాగించాలి. అసెంబ్లీ నియోజకవర్గాలను 153కు పెంచాలి. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ సీట్లను పెంచాలి. జనాభా నియంత్రణపై కేంద్రం ఆదేశాలను దక్షిణాది రాష్ట్రాలు పాటించాయి. ఉత్తరాది రాష్ట్రాలు జనాభాను నియంత్రించలేదు. ప్రస్తుతం డీలిమిటేషన్ జనాభా ప్రాతిపదికన జరుగుతోంది. 1971లో రాజ్యాంగ సవరణ ద్వారా డీలిమిటేషన్‌ను 25 ఏళ్లు నిలిపేశారు. డీలిమిటేషన్‌పై గందరగోళం నెలకొంది. ఇటీవల తమిళనాడు సీఎం స్టాలిన్ డీలిమిటేషన్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. జనాభా ఆధారంగా చేసే నియోజకవర్గాల పునర్విభజనను అంగీకరించబోమని తీర్మానం చేశారు. జనాభా ఆధారంగా చేసే డీలిమిటేషన్‌ను వాజ్‌పేయీ కూడా వ్యతిరేకించారు. డీలిమిటేషన్‌పై కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదని కొందరు అంటున్నారు. జనాభా నియంత్రణపై కేంద్రం ఆదేశాలను దక్షిణాది రాష్ట్రాలు పాటించాయి. ఉత్తరాది రాష్ట్రాలు జనాభాను నియంత్రించలేదు. దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం లోక్‌సభలో 24 శాతం ప్రాతినిధ్యం ఉంది. డీలిమిటేషన్ జరిగితే ఇది 19 శాతానికి పడిపోతుంది. దీనికి వ్యతిరేకంగా అందరూ ఒకే మాటపై ఉండాలి. ప్రభుత్వం పెట్టే తీర్మానానికి పార్టీలకు అతీతంగా మద్దతు ఇవ్వాలి. ఏపీ, తెలంగాణ శాసనసభ నియోజకవర్గాలు పెంచాలని పునర్విభజన చట్టంలో ఉంది. ఇప్పటి వరకు శాసనసభ నియోజకవర్గాలను పెంచలేదు. 2011 జనాభా లెక్కల ప్రకారమే సిక్కిం, జమ్ము కశ్మీర్ నియోజకవర్గాలను పెంచారు. రాజకీయ ప్రయోజనం లేకపోవడంతోనే తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్లు పెంచలేదు. 24 శాతం ప్రాతినిధ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి 36 శాతం పన్నులు కడుతున్నాయి. కేంద్రం నుంచి దక్షిణాది రాష్ట్రాలకు చాలా తక్కువ వస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్‌కు మాత్రం కేంద్రం పన్నుల్లో ఎక్కువ వాటా ఉంది" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## ర్యాష్ డ్రైవింగ్‌తో యువకునికి గాయాలు



కొవ్వూరు, (విశాఖ సమాచారమ్):- కుమారదేవం గ్రామంలో రాజమండ్రి కి చెందిన ఒక యువకుడు బైక్ మీద వెళుతుండగా ఠాగూర్ కంపెనీకి చెందిన బస్సు డ్రైవర్ నిర్లక్ష్య వైఖరి వలన బైక్ మీదకి బస్సు వచ్చి రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్ళింది.

బైక్ డూమ్ నుజ్జునుజ్జు అయ్యి ఆ యువకుడికి గాయాలు కూడా అయ్యాయి. ఆ చుట్టుపక్కల వారు వెంటనే అతన్ని కొవ్వూరు హాస్పిటల్ కి తీసుకెళ్లారు. బస్సు డ్రైవర్ ఎంత అహంకారంతో ఉన్నాడంటే కనీసం బస్సు ఆపకుండా వెళ్ళిపోయాడు.

ఠాగూర్ ఫార్మసీ కంపెనీ స్థాపించిన దగ్గర నుంచి ఆ బస్సు చేసిన ప్రమాదాలు చాలా ఎక్కువగా ఉన్నాయి.

ఒక ప్రక్క విషవాయువుతో మనుషులు చనిపోతూ ఉంటే ఇటీవల కూడా 30 మంది అస్వస్థత కు గురైనట్టు సమాచారం.. ఇది నూటికి నూరు శాతం యజమాన్యం లోపం. మనుషుల ప్రాణాలు పోతున్నాయండి ఆ కంపెనీలో అందులో పని చేసే ఉద్యోగులకు కూడా చిన్న చిన్న స్వల్ప కాలిక స్కిన్ ఇన్ఫెక్షన్స్ వస్తూన్నాయి. చుట్టుపక్కల ప్రజానీకానికి వారి యొక్క ఆరోగ్యానికి విఘాతం కలిగించే ప్రమాదకరమైన విష వాయువు వెలువడుతుంది.

మనుషులు ప్రాణాలే పోతున్నాయి. డబ్బు తీసుకు రాగలదా! మనిషి ప్రాణాన్ని. ఠాగూర్ ఫార్మసీ (గోపవరం) కంపెనీ పై మరియు యాజమాన్యం పై తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజానీకం యొక్క ఆవేదన.

## మా ఆరోగ్యం కాపాడండి మహాప్రభో

### సర్కార్ వారిని వేడుకుంటున్న కాకినాడ రూరల్ నియోజకవర్గ ప్రజలు



కాకినాడ రూరల్, (విశాఖ సమాచారమ్):- పారిశుద్ధ్యన్ని నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ గ్రామాలలో ఎక్కడ గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది అని కాకినాడ రూరల్ నియోజకవర్గం ప్రజలు ఆరోపిస్తున్నారు. జనసేన పార్టీ అధినాయకుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కి చెందిన జిల్లాలోనే ఇలా ఉంటే రాష్ట్రంలో ఇంకా ఎంత దారుణంగా ఉందొ తెలియకనే తెలుస్తుందని అంటున్న ప్రజలు. వివరాల్లోకి వెళ్తే ఆ ప్రాంతంలో ఉండాలన్న ఆ దారి లో వెళ్లాలన్న ఆరోగ్యపరమైన సమస్యలు వస్తాయని భయం భయంగా ఉందంటున్న కాకినాడ రూరల్ రమణయ్యపేట గ్రామపంచాయతీ లోనీ ప్రజలు. రోజులు తరబడి చెత్తను ఒకే చోట వదిలేయడం, సంవత్సరాలు తరబడి ఆ ప్రదేశంలో చెత్తను డంప్ చేయడం మా సమస్యలకు కారణం అంటున్న స్థానికులు. అసలే దోమల బెడద ఎక్కువైందని రోగాలు దరిచేరితే పట్టించుకునే నాథుడే లేడని, దోమల నివారణకు కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదని ఆందోళన చెందుతున్న గ్రామస్తులు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న సమస్య పరిష్కరించడం లేదని అక్కడ వేస్తున్న చెత్త ను తీయకపోగా, ప్రభుత్వం వారి హెచ్చరిక ఇక్కడ ఎవరు చెత్త వేయకూడదని బోర్డులు పెట్టి మరి పారిశుధ్య కార్మికులే ఇంటింటికి సేకరించిన చెత్తను అక్కడ వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను డంప్ చేసి అక్కడే తగలబెడుతున్నారని వాటి నుంచి వచ్చిన పొగ వల్ల ఆరోగ్యపరమైన సమస్యలకు గురవుతున్నామని అటుగా వెళ్లే వాహనదారులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీకి ఆమడ దూరంలోనే ఇంత జరుగుతున్న అధికారులకు తెలియడం లేదా చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారా అంత భయంకరంగా హెచ్చరిక బోర్డు పెట్టిన అక్కడ వేస్తున్న చెత్తను చూస్తుంటే కూటమి ప్రభుత్వంలో అధికారుల పనితీరు ఎలా ఉందో చెప్పచ్చు అంటూ పలువురు ఎద్దేవా చేస్తున్నారు. కాకినాడ విశాఖపట్నం ప్రధాన రహదారికి పది మీటర్ల దూరంలోనే డంపింగ్ చేయడం వాటిని తగలబెట్టడం వల్ల వచ్చే పొగ జాతీయ రహదారి పైకి వస్తుందంటూ మరికొందరు అంటున్నారు. పక్కనే ప్రముఖ ఎస్ ఆర్ ఎమ్ టి షాపింగ్ మాల్ ఉంది ఇలా చేయడం పట్ల షాపింగ్ మాల్ కు వచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారని మరికొందరు తెలుపుతున్నారు. ఆ ఒక్క ప్రదేశంలోనే కాకుండా రూరల్ నియోజకవర్గంలో పలు గ్రామాల్లో పారిశుధ్య లోపం ఉంది అని నియోజకవర్గంలో ప్రజలు అయితే బలంగా ఆరోపిస్తున్నారు. ఇప్పటికీ అయినా పై అధికారులు దీనిపై దృష్టి సారించి అక్కడ వేసిన చెత్తను తొలగించి మరల ఎప్పుడు అక్కడ చెత్త వేయడం తగలబెట్టడం చేయకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అక్కడ ప్రజలయితే కోరుతున్నారు..

## దేవరపల్లి ఎంపీపీగా చింతల బుల్లి లక్ష్మి



దేవరాపల్లి, (విశాఖ సమాచారమ్):- మండలంలోని తారువా గ్రామంలో దేవరాపల్లి మండల పరిషత్ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నిక కాబడిన శ్రీమతి చింతల బుల్లిలక్ష్మి కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి మరియు అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బూడి ముత్యాలనాయుడు శుభాకాంక్షలు తెలియజేసి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ యొక్క ఎన్నికకు సహకరించి అందరు ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఒకే మాటపై ఉండి అధికార పార్టీ వాళ్ళు ఎన్ని ప్రలోభాలు పెట్టినా,ఎన్ని బెదిరింపులు గురించేసినా దేనికి లొంగకుండా పార్టీ నాయకత్వం ఇచ్చిన ఆదేశాలుకు కట్టుబడి పార్టీ ప్రతిష్ట పెంచి వైస్సార్సీపీకి చెందిన నూతన ఎంపీపీని ఎన్నుకోవడంతో వారు అందరని ప్రత్యేకంగా అభినందించారు. ఈ యొక్క కార్యక్రమంలో దేవరాపల్లి జడ్పీటీసీ కర్రి సత్యం,దేవరాపల్లి మండల పరిషత్ ఉపాధ్యక్షులు శ్రీమతి ఊర్రోకుల గంగాభవాని, దేవరాపల్లి మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు, ఎంపీటీసీలు,సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు,మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ కార్డును అప్డేట్ ఉంచుకోవాలి!



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- మన గుర్తింపుకు ఆధారమైన ఆధార్ కార్డును ప్రతి ఒక్కరూ అప్ డేట్ గా ఉంచుకోవాలని విశాఖపట్నం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు కోరారు. గురువారం ఆయన ఎంవిపి కాలనీలోని తన కార్యాలయంలో ఆధార్ అప్డేట్ సెంటర్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి పనికీ ఆధార్ కార్డే ఆధారమని, అటువంటి ముఖ్యమైన కార్డును ఎల్లప్పుడూ సరైన లేటెస్ట్ సమాచారంతో అప్డేట్గా ఉంచు కోవాలని పేర్కొన్నారు. ఆధార్ కార్డుల్లోని వ్యక్తిగత వివరాల్లో మార్పులు, చేర్పులు తదితర సవరణల కోసం తూర్పు నియోజక వర్గంలోని ప్రజలందరి సౌకర్యార్థం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, అందరూ దీన్ని వినియోగించు కోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ తూర్పు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు గొలగాని పోలారావు, టీడిపి బీసీ సీనియర్ నాయకులు ఆడారి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మండల బూత్‌స్థాయి సమావేవం



తాళ్ళపూడి, (విశాఖ సమాచారమ్):- తాళ్లపూడి మండలం వేదికగా బిజెపి మండల నాయకుల సమావేశమయ్యారు.

ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొవ్వూరు నియోజకవర్గం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా సంస్థాగత నిర్ణయంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ బీజేపీ కార్యవర్గంలో తాళ్లపూడి మండలంలోని మండల అధ్యక్షుడు నిర్వహణలో బూత్ స్థాయిలు 46 ఉండగా 32 వరకు 11 మంది నాయకులతో పనిచేస్తున్నారని, త్వరలో అన్ని బూత్ స్థాయిలను పూర్తిచేసి పార్టీని ముందుకు తీసుకువెళ్తామని చెప్పారు.

ఈ సమావేశంలో బిజెపి మండల అధ్యక్షులు ఇందుగలమెల్లి రామకృష్ణ, ఉపాధ్యక్షులు వెలుగుబంటి బాలకృష్ణ, కళిశెట్టి సన్యాసినాయుడు, మద్దుకూరి అరుణ, నామా రంగయ్య నాయుడు, పండిందల లింగాచార్యులు, కార్యదర్శి బత్తుల పాట్లు, అన్నపురెడ్డి లక్ష్మీపతి, పెన్నాడ నరసింహమూర్తి, కొండేపాటి సత్యనారాయణ, షేక్ మెహర్న, ట్రెజరర్ మర్రి ముర్తల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు గోకవరపు జితేంద్ర రవి, మల్లిపూడి రాజేష్ తదితర బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్ల కోసం నేడు గిరిజనుల పాదయాత్ర



దేవరపల్లి, (విశాఖ సమాచారమ్):- శుక్రవారం శంకరం పంచాయతీలో కొత్త వలస వెలగల పాడు గోప్పూరు తాడివలస రాజాం రాయిపాలెం మామిడి పాలెం 7 గ్రామాలకు చేందిన గిరిజనులు స్వచ్ఛందగా బయలు దేరి నిలిచి పోయిన రోడ్లు పూర్తి చేయాలని శంకరం పంచాయతీ క్రిష్ణం పాలెంలో 7 గంటలకు పాదయాత్ర మొదలు పెట్టి మాడుగుల వరకు 15 కిలోమీటర్ల పాదయాత్ర చేసి వి మాడుగుల ఎంపిడిఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరుగుతుంది అని సిపిఐ నాయకులు డి వెంకన్న, ఇరట నరసింహమూర్తి, గిరిజనులు తెలిపారు.

## 'ప్లాటినం'తో ఉగాదిని ప్రత్యేకంగా జరుపుకోండి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- 'ఉగాది'కి తెలుగు లోగిళ్లలో ఎంతో ప్రత్యేకత ఉంది. వసంత ఋతువును ఆహ్వానిస్తూ.. కొత్త ఆరంభాలకు సంకేతంగా ఈ పండగను జరుపుకుంటారు. కుటుంబ సభ్యులు సంప్రదాయాన్ని పాటిస్తూ ఆనందాన్ని పంచుకుంటూ, కొత్త అధ్యాయాన్ని స్వాగతించేందుకు కలుసుకునే ఈ ప్రత్యేక సందర్భాన్ని, అరుదైన, విలువైన 'ప్లాటినం'తో మరింత విశిష్టంగా మార్చుకోవచ్చు. శాశ్వతమైన కాంతిని కలిగి ఉన్న ఈ ప్లాటినం ఉగాది నాడు కొత్త అవకాశాలు, ఆకాంక్షలకు వేదికగా నిలవనుంది. మీ కోసం ఏదైనా ప్రత్యేకమైన దానిని పొందాలనుకున్నా, మీ ప్రియమైన వారికి అర్థవంతమైన బహుమతిని అందించాలనుకున్నా, ప్లాటినం ఆభరణాలు వైపు చూడవచ్చు. మెన్ ఆఫ్ ప్లాటినం, ప్లాటినం ఎవారా, ప్లాటినం లవ్ బ్యాండ్స్ కలవు. ఇవి పురుషులు, స్త్రీలు, యువత కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆభరణాలు. ఏది ఎంచుకున్నా ప్లాటినం మృదువైన మహత్యం ఉగాది వేడుకలకు మరింత అందాన్ని తెస్తుంది.

95 శాతం స్వచ్ఛత కలిగిన ప్లాటినం అత్యంత విలువైన లోహాలలో ఒకటిగా పేరు పొందింది. నక్షత్రాలలో పుట్టిన ఈ అరుదైన లోహం దినసరి వాడకంలోనూ తన ప్రకాశాన్ని, రూపాన్ని కోల్పోదు. మెన్ ఆఫ్ ప్లాటినంలోని ఆకర్షణీయమైన గొలుసులు, ప్లాటినం ఎవారాలోని ఉంగరాలు, చెవి గొలుసులు, కంకణాలు, ప్లాటినం లవ్ బ్యాండ్స్‌లోని శాశ్వతమైన ప్రేమ ప్రతీకలు మనస్సుకు ఎంతో హాయిని ఇస్తాయి. ప్రతీ ఆభరణం ఒక కళాఖండంగా ఉంటుంది. ఈ ఉగాది నాడు అందమైన ప్లాటినం ఆభరణాలు ధరించండి. ఇవి దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆభరణాల దుకాణాలలో లభ్యమవుతున్నాయి.

# క్రీడా సమాచారమ్

## 'రూ. 11 కోట్లు పెట్టారు.. ఎనిమిదో స్థానంలో పంపిస్తారా?'



**ఇంటర్నెట్ డెస్క్:** రాజస్థాన్ రాయల్స్‌కు మళ్లీ పరాజయం ఎదురైంది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు తొలి విజయం దక్కింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో తొలి మూడు మ్యాచ్‌లకు సంజు శాంసన్ స్థానంలో రియాన్ పరాగ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. అయితే, వరుసగా రెండు మ్యాచుల్లోనూ ఓడిపోవడంతో పరాగ్ నిర్ణయాలపై ఇప్పుడు విమర్శలు మొదలయ్యాయి. కీలకమైన సమయంలో బ్యాటర్లను పంపించడంలో రియాన్ ఇబ్బందిపడుతున్నట్లు అనిపించిందని మాజీ క్రికెటర్ సైమన్ డౌల్ వ్యాఖ్యానించాడు. రూ. 11 కోట్లు పెట్టి రిటైన్ చేసుకున్న షిమ్రోన్ హెట్‌మయెర్‌ను ఎనిమిదో స్థానంలో ఆడిస్తారా? అని ప్రశ్నించాడు. కరేబియన్ లీగ్‌లో అతడిని వన్‌డౌన్ లేదా సెకండ్ డౌన్‌లో ఆడించేవాళ్లని గుర్తు చేశాడు.

"ఎందుకు హెట్‌మయెర్‌ను దిగువన పంపిస్తారు. అతడిని రిటైన్ చేసుకోవడానికి ఎంత వెచ్చించారు? రూ.11 కోట్లు పెట్టి మరీ తమవద్ద అట్టి పెట్టుకున్నారు. మరి అతడిని ఎనిమిదో స్థానంలో ఆడిస్తున్నారు. గయానాలో అతడు నాలుగో స్థానంలోపే బరిలోకి దిగేవాడు. అతడిని ఎందుకు ఐపీఎల్‌లో లోయర్ ఆర్డర్‌కు పంపించారు? అతడు ఫినిషర్ అని అనుకుంటున్నారు కదా.. కానీ, ఈ నిర్ణయం అత్యంత చెత్తదే. అతడు కేవలం హిట్టింగ్ మాత్రమే కాకుండా నిలకడగా పరుగులు చేయగల బ్యాటర్. ఇంపాక్ట్ సబ్‌ను పంపించకముందే హెట్‌మయెర్‌ను ఆడించాలి. ఒకవేళ విఫలమైతే అప్పుడు ఇంపాక్ట్‌ను బరిలోకి దింపాలి. తొలి రెండు మ్యాచుల్లో రాజస్థాన్ రాయల్స్ ప్రణాళికలు బాగోలేవు. విభిన్నమైన వ్యూహాలు, నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కనీసం ఐదు లేదా ఆరో స్థానంలో వచ్చినా హెట్‌మయెర్ మరిన్ని పరుగులు చేసేవాడు. శుభమ్ దూబెను ఇంపాక్ట్‌గా తీసుకురావాల్సిన అవసరమే లేదు. ఆర్చర్ కూడా ఆఖర్లో సిక్స్ కొట్టాడు. వీరంతా త్వరగా ఔటైతే అప్పుడు దూబెను ఆడిస్తే బాగుండేది. ఇలా చేస్తే అదనంగా ఓ స్పిన్నర్‌ను ఇంపాక్ట్ సబ్‌గా తీసుకొనే వెసులుబాటు లభించేది" అని డౌల్ వ్యాఖ్యానించాడు.

**కేవలం 7 పరుగులే..**

కోల్‌కతా బౌలర్ల దెబ్బకు రాజస్థాన్ 15 ఓవర్లలో 110 పరుగులకే ఆరు వికెట్లను కోల్పోయింది. అప్పటికి క్రీజ్‌లో ధ్రువ్ జురెల్ ఉన్నాడు. అతడితోపాటు హెట్‌మయెర్ (7) బ్యాటింగ్ చేసేందుకు వచ్చాడు. దీంతో కనీసం 160కిపైగా పరుగులు చేసే అవకాశం ఉంది. అదే సమయంలో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని తీసుకొచ్చిన కేకేఆర్ ఫలితం రాబట్టింది. హెట్‌మయెర్‌ను భారీ షాట్లు కొట్టకుండా అడ్డుకోగలిగింది. చివరికి హర్షిత్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్ చివరి బంతికి భారీ షాట్‌కు యత్నించి హెట్‌మయెర్ పెవిలియన్‌కు చేరాడు. అప్పటికి 8 బంతులను ఆడిన హెట్‌మయెర్ కేవలం ఒక్క ఫోర్ మాత్రమే కొట్టాడు. ఆఖర్లో జోఫ్రా ఆర్చర్ (16: 7 బంతుల్లో 2 సిక్స్‌లు) దూకుడు ప్రదర్శించడంతో రాజస్థాన్ స్కోరు 150 పరుగుల మార్క్‌ను దాటింది.

## దేవుడు అంటే భక్తి, భయం ఉన్నది ఎవరికి?: వైఎస్ జగన్




**గుంటూరు:** ఏపీలో కూటమి పాలనలో ఒకవైపు యథేచ్ఛగా జరుగుతున్న ఆలయాల కూల్చివేతలు, మరోవైపు హిందూ ధర్మంపై కొనసాగుతున్న దాడులపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఆలయాల పరిరక్షణ కొనసాగిందన్న ఆయన.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతోనే ఇప్పుడు ఏపీలో ఆధ్యాత్మిక శోభ దెబ్బ తింటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైఎస్ జగన్‌ట్వీట్‌లో ఏమన్నారంటే.. నాకు వచ్చిన అర్జీ, దానికి సంబంధించిన విషయాలు విన్న తర్వాత ఈ ప్రభుత్వంపై నా కామెంట్ ఏంటంటే.., దేవుడు అంటే భక్తి, భయం ఉన్నది ఎవరికి?. ఎవరి హయాంలో ఆధ్యాత్మిక శోభ విలసిల్లింది? ఎవరి హయాంలో హైందవ ధర్మాన్ని పరిరక్షించారు? కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రసిద్ధ కాశినాయన క్షేత్రంలో కూల్చివేతలు, రాష్ట్రంలో ఆలయాలపైన, హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులకు ప్రత్యక్ష సాక్ష్యాలు కావా?..

అటవీ ప్రాంతంలో ఉన్న కాశినాయన క్షేత్రంలో నిర్మాణాల నిలిపివేత, వాటి తొలగింపుపై ఆగస్టు7, 2023న కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ ఆదేశాలు ఇచ్చినా, ఆ క్షేత్ర పరిరక్షణకు మా ప్రభుత్వం నడుంబిగించిన మాట వాస్తవం కాదా? అదే నెల ఆగస్టు 18, 2023న అప్పటి కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌గారికి ముఖ్యమంత్రి హోదాలో నేనే స్వయంగా లేఖరాసి కాశినాయన క్షేత్రం ఉన్న 12.98 హెక్టార్ల భూమిని అటవీశాఖ నుంచి మినహాయించాలని, ఆ క్షేత్రానికి రిజర్వ్ చేయాలని, దీనికోసం ఎలాంటి పరిహారం కోరినా, ఎలాంటి ఆంక్షలను విధించినా తు.చ.తప్పక పాటిస్తామని లేఖలో చాలా స్పష్టంగా చెప్పాం. మా ప్రయత్నాలతో కేంద్రం తన చర్యలను నిలుపుదల చేసింది. మా ఐదేళ్ల పాలనలో కాశినాయన క్షేత్రానికి వ్యతిరేకంగా ఎవ్వరూ ఒక్క చర్యకూడా తీసుకోలేదు. ఆలయాలపట్ల, ఆధ్యాత్మిక కేంద్రాల పరిరక్షణపట్ల మాకున్న చిత్తశుద్ధికి నిదర్శనం ఇది.

మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 6 నెలల నుంచే ఇదే కాశినాయన క్షేత్రంలో ఏం జరిగిందో రాష్ట్రం అంతా చూస్తోంది. ఒక ప్రసిద్ధ క్షేత్రంపై బుల్డోజర్లు నడిపి కిరాతకంగా, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో, కలెక్టర్ ఆదేశాలతో, ఆర్డీఓ పర్యవేక్షణలో కూల్చివేస్తూ వచ్చారు.

చంద్రబాబు ఆదేశాల మేరకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యవేక్షణలో ఉన్న తన పర్యావరణ, అటవీశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఇచ్చిన కూల్చివేత ఉత్తర్వులతో హిందూ ధర్మంపైన, ఆధ్యాత్మిక క్షేత్రాలపైన అధికార అహంకారంతో దాడిచేశారు. ఇవిగో ఆధారాలు, ఏమిటీ మీ సమాధానం? తామే ఉత్తర్వులిచ్చి, తమ చేతులతోనే కాశినాయన క్షేత్రాన్ని కూల్చేసి, వాతలు పెట్టి, వెన్నపూసిన మాదిరిగా ఇప్పుడు మాటలు చెప్తున్నారు. వీళ్ల తీరే అంత?

ఈ ప్రభుత్వం వచ్చాకే వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్టను దిగజారుస్తూ జరిగిన తిరుమల లడ్డూ దుష్ప్రచార వ్యవహారమైనా, టీటీడీ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా తొక్కిసలాటలో భక్తులు మరణించిన ఘటన విషయంలోనైనా, ఇప్పుడు కాశినాయన క్షేత్రంలో గుడి కూల్చివేతలైనా.. ఇలా ఏదైనా అంతే. ఆలయాలపై వివిధ రూపాల్లో దాడులు చేసేదీ వీళ్లే, అబద్ధాలను ప్రచారం చేసేదీ వీళ్లే, మళ్లీ ధర్మ పరిరక్షకులుగా తమనుతాము చిత్రీకరించుకునేది వీళ్లే.

ఒకరు ఆదేశిస్తారు, మరొకరు పర్యవేక్షిస్తారు. సనాతన వాదిగా చెప్పుకుంటూ కాశీనాయన క్షేత్రంలో కూటమి ప్రభుత్వం చేసిన దారుణాలకు బాధ్యత వహించాల్సిన, అటవీశాఖను చూస్తున్న డిప్యూటీ సీఎం, తన శాఖ పరిధిలోనే జరిగిన ఈ కూల్చివేతలపై ఇప్పటివరకూ ఒక్క మాటకూడా మాట్లాడలేదు. ఇలాంటి వీరికి హిందూ ధర్మంపైన, ఆలయాల పరిరక్షణపైనా మాట్లాడే హక్కు ఉందా? అని వైఎస్ జగన్ నిలదీశారు.

## ఆ ఇద్దరిపై వేటు..

### టీమ్ఇండియా కోచింగ్ బృందంలో మార్పులు?



**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్ ముగిసిన తర్వాత.. భారత జట్టు టెస్టు సిరీస్‌ను ఆడనుంది. ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ కోసం అక్కడి పర్యటించనుంది. ప్రస్తుతం ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కుటుంబంతో కలిసి విహార యాత్రకు వెళ్లినట్లు సమాచారం. తాజాగా మరో విషయం వెలుగులోకి వచ్చింది. ఇంగ్లాండ్ పర్యటన నాటికి టీమ్ఇండియా సహాయక స్టాఫ్‌లో బీసీసీఐ భారీ మార్పులను చేయనుందని వార్తలు వస్తున్నాయి. జట్టుతో పాటు జంబో సపోర్ట్ స్టాఫ్‌ను పంపించేందుకు బీసీసీఐ అనాసక్తి కనబరుస్తోంది. ఈ క్రమంలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మార్చి 29న గువాహటిలో సమావేశం కానున్నట్లు సమాచారం.

**వారిద్దరిని తప్పించి..**

రాహుల్ ద్రవిడ్ తర్వాత ప్రధాన కోచ్‌గా గంభీర్ బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. తనకు సహాయం అందించేందుకు ఇద్దరు అసిస్టెంట్ కోచ్‌లు, బౌలింగ్ కోచ్‌ను పెట్టుకొన్నాడు. రైన్ టెన్ దస్కతే, అభిషేక్ నాయర్‌లు అసిస్టెంట్ కోచ్‌లు. మోర్నీ మోర్కెల్‌ను బౌలింగ్ కోచ్‌గా నియమించుకున్నాడు. ఫీల్డింగ్ కోచ్‌గా దిలీప్‌ను కొనసాగించాడు. సితాన్షు కోటక్‌ను బ్యాటింగ్ కోచ్‌గా నియమించాడు. ఛాంపియన్స్ ట్రోఫీగా విజేతగా నిలవడంలో వీరందరూ కీలక పాత్రే పోషించారు. ఈ క్రమంలో రాబోయే ఇంగ్లాండ్ పర్యటనకు ప్రత్యేకంగా అసిస్టెంట్ కోచ్, ఫీల్డింగ్ కోచ్ అవసరం లేదని బీసీసీఐ భావిస్తోంది. దీంతో అభిషేక్ నాయర్, దిలీప్‌ను పక్కన పెట్టే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే జట్టుతోపాటు ఉన్న సితాన్షు, మోర్నీ మోర్కెల్ పదవులకు ఎలాంటి ఇబ్బంది ఉండకపోవచ్చు. అయితే, గౌతమ్ గంభీర్ నిర్ణయం ఎలా ఉంటుంది.. కచ్చితంగా సపోర్ట్ స్టాఫ్ కావాలంటే బీసీసీఐ ఏం చేస్తుందో కూడా ఆసక్తికరమేనని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.616 కోట్లు ఎగనామం



బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీఓఐ) రోల్టా ఇండియా లిమిటెడ్‌కు ఇచ్చిన రూ.616.30 కోట్ల రుణాలను తిరిగి చెల్లించకుండా మోసం చేసిందని ప్రకటించింది. ఐటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన రోల్టా 2023 జనవరిలో దివాలా ప్రకటించి వివిధ రుణదాతలకు సుమారు రూ.14,000 కోట్లు బకాయి పడింది. ఈ కేసును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు నివేదించారు.

రోల్టా ఇండియా లిమిటెడ్ చేసిన రూ.616.30 కోట్ల రుణాల మోసం వివరాలను బ్యాంక్ ఆఫ్ ఇండియా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కి నివేదించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. సెబీ (ఎల్ఓడీఆర్) రెగ్యులేషన్స్, 2015 కింద బ్యాంక్ రెగ్యులేటరీ కాంప్లయన్స్, అంతర్గత వివరాల వెల్లడి విధానాల్లో భాగంగా బీఓఐ ఈ విషయాన్ని పేర్కొంది. మే 2024 కొన్ని సంస్థల నివేదిక ప్రకారం రోల్టా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) నేతృత్వంలోని సంస్థలకు రూ.7,100 కోట్లు, సిటీ గ్రూప్ నేతృత్వంలోని అన్ సెక్యూర్డ్ విదేశీ బాండ్ హోల్డర్లకు మరో రూ.6,699 కోట్లు బకాయి పడింది.

## అందాల బొమ్మ.. తెర్లాం భామ



తెర్లాం, రాజాం, : పుట్టింది పల్లెటూర్లో. పెరిగింది చిన్న పట్టణంలో. ఆపై ఉన్నత చదువు కోసం విదేశం వెళ్లిన ఆ తెలుగమ్మాయి అందాల భామల పోటీ ఫైనల్ జాబితాకు చేరింది. ఆమే తెర్లాం మండలం పణుకువలస పంచాయతీ సోమిదవలస గ్రామానికి చెందిన చందక సాయిసాత్విక. అమెరికాలో ఎమ్మెస్ చదువుతున్న ఈ యువతి తెలుగు సంఘం ఆధ్వర్యంలో డల్లాస్‌లో మంగళవారం నిర్వహించిన 'మిస్ తెలుగు యుఎస్ఏ-2025' పోటీల్లో పాల్గొంది. ఫైనల్‌లో నిలిచిన 20 మంది జాబితాలో చేరింది. టెక్సాస్‌లోని ఆస్టిన్ సిటీలో ఉంటున్న అక్కాబావల వద్ద ఉంటోంది. తల్లిదండ్రులు చందక సూర్యకుమార్, సబిత 20 ఏళ్లుగా రాజాం మండలం కంచరాంలో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం ఫైనల్‌లో నంబరు వన్‌గా నిలబడేందుకు ఓటింగ్ నిర్వహిస్తున్నారని వారు చెప్పారు.

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెం.
95535 74250

## రూ. 4 కోట్లా? ప్రభుత్వ ఉద్యోగమా? స్థలమా?.. ఏది కావాలి?

### వినేశ్ ఫొగట్‌కు హర్యానా ప్రభుత్వం ఆప్షన్లు



ప్యారిస్ ఒలింపిక్స్-2024 లో సత్తా చాటిన భారత రెజ్లర్, ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే వినేశ్ ఫొగట్ కు.. హర్యానా ప్రభుత్వం మూడు ఆప్షన్లు ఇచ్చింది. "రూ. 4 కోట్లా? ప్రభుత్వ ఉద్యోగమా?.. లేదంటే ప్లాట్".. వీటిలో ఆమెకు ఏదీ కావాలో చెప్పాలని కోరింది. కాగా వినేశ్ ఫొగట్ తృటిలో ఒలింపిక్ పతకాన్ని చేజార్చుకున్న విషయం తెలిసిందే.

మహిళల యాభై కిలోల కుస్తీ విభాగంలో అద్భుత ప్రదర్శనలతో ఫైనల్‌కు చేరిన వినేశ్.. ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా చరిత్ర సృష్టించారు. అయితే, అనూహ్య రీతిలో టైటిల్ పోరుకు ముందు.. పోటీలో పాల్గొనకుండా ఆమెపై వేటు పడింది. నిర్ణీత బరువు కంటే వంద గ్రాములు ఎక్కువగా ఉన్న కారణంగా పతకం కోసం పోటీ పడే అవకాశం చేజారింది.

కనీసం రజతమైనా ఇవ్వాలని అప్పీలు

ఆ తర్వాత స్పోర్ట్స్ కోర్టులో కనీసం రజతమైనా ఇవ్వాలని అప్పీలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఒక్క గ్రాము బరువు ఎక్కువగా ఉన్నా పోటీకి, పతకానికి అనర్హులే అంటూ కోర్టు వినేశ్ ఫొగట్ పిటిషన్‌ను కొట్టి వేయడంతో ఆమెతో పాటు యావత్ భారతావనికి నిరాశే మిగిలింది.

అయితే, ఫైనల్ వరకు వినేశ్ చేరిన తీరును ప్రశంసిస్తూ అభినందలు వెల్లువెత్తాయి. ఓడినా మనసులు గెలిచిందంటూ ఆమెపై ప్రశంసల జల్లు కురిసింది. నాడు.. ప్రస్తుత హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ సైతం.. "హర్యానాకు గర్వకారణమైన ఫొగట్ గౌరవాన్ని మేము మరింత పెంచుతాం" అని ట్వీట్ చేశారు.

కుస్తీకి వీడ్కోలు పలికి..రాజకీయ రంగ ప్రవేశం

అంతేకాదు.. రాష్ట్ర క్రీడా విధానాన్ని అనుసరించి ఒలింపిక్స్‌లో రజతం గెలిచిన ఆటగాళ్లకు ఇచ్చే నజరానాను వినేశ్‌కు అందిస్తామనే హామీ అందింది. అయితే, ఆ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. అనూహ్య రీతిలో పతకం చేజారిన చేదు అనుభవాన్ని జీర్ణించుకోలేక వినేశ్ ఫొగట్ కుస్తీకి వీడ్కోలు పలికి..రాజకీయ రంగ ప్రవేశం చేశారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి ఝులానా నియోజకవర్గంలో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన ఆమె.. అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఈ క్రమంలో క్రీడాకారుల కోటాలో తనకు అందాల్సిన నజరానా గురించి ఇటీవల విధాన సభలో ప్రస్తావించారు.

**హామీ మరిచారా?**

"వినేశ్ ఫొగట్ మా కూతురు. ఒలింపిక్ సిల్వర్ మెడలిస్ట్‌కు ఇచ్చే రివార్డును ఆమెకు అందజేస్తాం అని ముఖ్యమంత్రి గారు చెప్పారు. కానీ ఇంత వరకు ఆ హామీని పూర్తి చేయలేకపోయారు.

ఇది కేవలం డబ్బుకు సంబంధించిన విషయం కాదు. గౌరవానికి సంబంధించిన అంశం. ఈ రాష్ట్రంలో చాలా మంది క్రీడాకారులకు ఇప్పటికే రివార్డులు అందజేశారు" అని వినేశ్ ఫొగట్ బీజేపీ ప్రభుత్వ తీరును విమర్శించారు.

ఈ నేపథ్యంలో మంగళవారం నాటి కేబినెట్ సమావేశంలో వినేశ్ ఫొగట్ రివార్డుకు సంబంధించి ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ నిర్ణయం తీసుకున్నారు. "వినేశ్ ఫొగట్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. తన క్యాష్ రివార్డుకు సంబంధించిన అంశాన్ని ఆమె విధాన సభలో లేవనెత్తారు.

**ఈ మూడింటిలో ఏది కావాలి?**

అందుకే కేబినెట్ ప్రత్యేకంగా ఈ విషయంపై చర్చించింది. స్పోర్ట్స్ పాలసీ ప్రకారం ఆమెకు ప్రయోజనాలు చేకూర్చాలని నిశ్చయించింది" అని తెలిపారు. నిబంధనల ప్రకారం.. రూ. 4 కోట్ల క్యాష్ ప్రైజ్.. లేదంటే ప్రభుత్వ ఉద్యోగం.. లేదా హర్యానా షహరీ వికాస్ ప్రాధికారణ్ పథకం కింద ప్లాట్.. ఈ మూడింటిలో ఏదో ఒకటి తీసుకోవాలని కేబినెట్ వినేశ్ ఫొగట్‌కు ఆఫర్ ఇచ్చింది.

అయితే, ఆమె ఇంతవరకు స్పందించకపోవడం గమనార్హం. ఇక తాను తల్లి కాబోతున్నట్లు ఇటీవలే వినేశ్ ఫొగట్.. తన భర్త, రెజ్లర్ సోమ్‌వీర్ రాఠీతో కలిసి శుభవార్త పంచుకున్న విషయం తెలిసిందే.




VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, For advertisements (Raghunath) : 7013785256, Arilova (D.Venkatesh) : 94937 77390.
Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Anakapalli (M.Krishna Rao) : 63023 75539, Chintapalli (Srinivas) : 94923 40861.
Bheemunipatnam (B.Appalareddy) : 98662 78981, Srikakulam (Ramarao) : 70321 98574, Pithaapuram (staalin) : 94912 23264,

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.